గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక

# ఆగస్ట్ 2015
# కథలు




పగలు రాజ్యపాలన సాగిస్తూ రాత్రిళ్ళు మారువేషంలో సంచారం చేసి ప్రజల కష్టసుఖాలను స్వయంగా పరిశీలించడం మహారాజు కృష్ణవర్మగారికి అలవాటు. ఒకసారి ఇలాగే బాటసారి వేషంలో పర్యటిస్తూ రాత్రి చీకటి పడే వేళకు నగర పొలిమేరల్లోని ఒక ఇంటితలుపు తట్టారు కృష్ణవర్మమహారాజు.

ఆ ఇల్లొక బీద బ్రాహ్మణుడిది. ప్రాచీన సంప్రదాయాలకు ప్రాణమిచ్చే కుంటుంబం అతనిది. ఉన్నంతలోనే చేతనైనంత అతిధి మర్యాదలు చేసాడా రాత్రి.

భోజనం ముగించి.. పడుకునే ముందు బాటసారికి, బ్రాహ్మణుడికి మధ్య చిన్నపాటి లోకాభిరామాయణం సాగింది.

మాటల సందర్భంలో బ్రాహ్మణుడు మారువేషంలోని రాయలవారితో దేశంలో జరుగుతున్న అన్యాయాలను, అవినీతిని, అక్రమాలను ఏకరువు పెట్టి రాజుగారి పాలనను దుయ్యబట్టాడు.

అంతా సావకాశంగా విన్న రాజావారు "అన్ని కార్యాలూ రాజుగారే స్వయంగా చూసుకోవాలంటే సాధ్యమా! న్యాయ పర్యవేక్షణ, చట్టం అమలు వంటి విభాగాల నిర్వహణకు అందుకే ఆయన ఎక్కడికక్కడ ఉద్యోగులను నియమించారు కదా! వారి ప్రవర్తనల్లో లోపం కలిగితే ఆ దుష్ఫలితాలను రాజుకు ఆపాదించడం న్యాయం కాదు" అని వాదనకు దిగారు.

"కావచ్చు కానీ.. ప్రజలకు వాటితో పనిలేదు. అంతంత లోతులు ఆలోచించ లేని అమాయకులకు వారు. సుఖంగా బతుకుతున్నప్పుడు రాజుగారి చలవ వలనే అని ఎలా నమ్ముతారో.. శాంతి భద్రతలు కరువైనప్పుడూ అలాగే రాజుగారి వైపు వేలెత్తి చూపిస్తారు. శరీరానికి దెబ్బ తగిలితే.. గాయపరిచిన ఆయుధాన్ని కాకుండా.. ఆ ఆయుధాన్ని ప్రయోగించిన మనిషినే కదా మనం దూషిస్తాం! ఉద్యోగే అన్యాయం చేసినా.. అలాంటి దుర్మార్గుడికి అధికారం అప్పగించిన రాజే ఆ నిందను భరించక తప్పదు. సత్పరిపాలన అంటే సచ్చరితులను గుర్తించి సరైన పదవుల్లో నియోగించుకోవడమే" అన్నాడా బ్రాహ్మణుడు.

రాయలువారు ఆలోచనలో పడ్డారు.

"చెప్పడం సులభమే. పదవి చేతిలోకొచ్చిన తరువాత గాని అసలు నైజం బైటపడదు. ఎవరిదాకానో ఎందుకు.. మీకే గనక ఓ న్యాయాధికారి పదవి అప్పగిస్తే రాజుగారికే మచ్చా రాకుండా బాధ్యతలు నిర్వహించగలరా?" అని అడిగారు చివరికి.

బ్రాహ్మణుడే మాత్రం తొట్రు పడలేదు. " మహారాజు గారి నమ్మకాన్ని వమ్ము చేయననే అనుకుంటున్నాను" అన్నాడు. ఆ సంభాషణ అంతటితో ముగిసి పోయింది.

మర్నాడు ఆ బ్రాహ్మణుణ్ని కృష్ణవర్మమహారాజు కొలువుకి పిలిపించారు.

రాత్రి తన ఇంట్లో ఆతిథ్యం స్వీకరించింది స్వయంగా మహారాజా వారే అని అప్పటికి గాని గ్రహింపుకి రాలేదు బ్రాహ్మణుడికి. "నేటి నుంచి నగర న్యాయపాలనాధికారాలు తమకే అప్పగిస్తున్నాము. న్యాయం 'తు..చ' తప్పకుండా పాటించడ మెలాగో మీరు నిర్వహించి చూపించాలి. గడువు నెల రోజులు. గాడి తప్పినట్లు ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా శిక్ష ఘోరంగా ఉంటుంది. తల కోటగుమ్మానికి వేలాడటం ఖాయం. బీరాలు పలికి చివరికి కార్యభీరువులయే వారంతా నేర్చుకోవాల్సిన పాఠ్యగ్రంథంగా పనికొస్తుంది. అంగీకారమైతే వెంటనే అంగుళీకమును అందుకోవచ్చు" అని రాజముద్ర ఉన్న ఉంగరాన్ని ముందుకు చాచారు కృష్ణవర్మమహారాజు.

క్షణకాలం మాత్రమే ఆలోచన. ఆ రాజముద్రను అందుకుని భక్తిగా కళ్లకద్దుకొన్నాడు పేదబ్రాహ్మణుడు. నగర కొత్త న్యాయాధికారిగా రామశాస్త్రి పేరు ప్రకటింపబడింది. రామశాస్త్రి ఆ బ్రాహ్మణుడి పేరే.

సగం గడువు తీరిపోయింది. నగరంలో మార్పు కొట్టొచ్చినట్లు కనబడుతోంది ఇప్పుడు. మొదటి వారంలో రామశాస్త్రి దగ్గరకు వచ్చిన ఫిర్యాదుల్లో చాలావరకు అక్కడికక్కడే పరిష్కరింపబడ్డాయి. దోషులను విచారించడంలోను, దండనలు విధించడంలోను, శిక్షల అమలును పర్యవేక్షించడంలోను.. రామశాస్త్రి చూపిస్తున్న నిజాయితీ, నిష్పక్షపాతం, నిబద్ధత రెండోవారంలోనే మంచి ఫలితాలు చూపించడం మొదలు పెట్టాయి. నేరస్తులు జంకుతున్నారు. నిందితులు తప్పించుకునే కొత్తదారులు వెదుకుతున్నారు. శిక్షల రద్దుకోసం పూర్వం అవలంబించిన అడ్డదారులేవీ పనిచేయక ఇబ్బంది పడుతున్నారు బందీలు.

కొత్తన్యాయాధికారికి జనం 'జేజే'లు పలకడం నగరసంచారంలో కృష్ణవర్మ మహారాజు స్వయంగా గమనించారు. మహారాజా వారు రామశాస్త్రినే రాజ్యం మొత్తానికి శాశ్వత న్యాయాధికారిగా నియమించబోతున్నారన్న వార్త ఒకటి ప్రచారంలో కొచ్చేసింది ఎలాగో. అప్పుడు జరిగిందా విచిత్రం.

పనిమీద దేశాంతరం పోయిన ఒక వ్యాపారి అనుకోకుండా అర్థరాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. అమావాస్య కావడం వల్ల అప్పటికి చీకటి బాగా చిక్కపడి ఉంది. భార్య చాలా తాత్సారం చేసి గానీ తలుపు తీయలేదు. అనుమానం వచ్చిన భర్త ఇల్లంతా వెతికితే పడకగదిలో మంచం కింద మరొక మగమనిషి నక్కి కనిపించాడు. తప్పించుకుని పారిపోయే ప్రయత్నంలో వాడికీ, ఇంటియజమానికీ మధ్య పెద్ద పెనుగులాట అయింది. ఆ దెబ్బలాటలో కత్తిపోటుకి మగమనిషి ప్రాణాలు అక్కడికక్కడే పోయాయి. ఇప్పుడు హతుడి భార్య న్యాయం కావాలంటూ రామశాస్త్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

"ఆడమనిషి చనువు ఇవ్వకపోతే మొగవాడనే వాడికి అర్థరాత్రి ఇంట దూరే ధైర్యం ఎక్కడినుంచి వస్తుంది? భర్త వుండీ పరాయి మగవాడితో పోవాలనుకునే ఆడదానికి పడాలి అసలైన శిక్ష.. ముందుగా" అని విగతజీవుడి భార్య వాదన.

కొట్టి పారేయదగింది కాదు.

"నాకే పాపమూ తెలీదు. ఈ మనిషి ముఖం కూడా ఎన్నడూ చూసి ఎరగను. వీడు ఎప్పుడు ఇంట్లోకొచ్చాడో.. పడకగదిలో మంచం కింద ఎందుకు దూరాడో అస్సలు తెలీదు. నా బిడ్డమీద ఒట్టు. తలుపు ఆలస్యంగా తీయడానికి కారణం నేను మంచి నిద్రలో వుండటమే. మా ఇంటాయన ఆ సమయంలో వస్తాడని నేనేమన్నా కలగన్నానా?"అని భోరుమంది. కన్నబిడ్డమీద ప్రమాణం కూడా చేసి చెప్పిందా ఇల్లాలు. కల్లిబొల్లి కథలుగా శంకించడం సబబు కాదు.

"నిజానికి ఆ దుర్మార్గుడే నన్ను చంపాలని చూసాడు. తప్పించుకునే ప్రయత్నంలో నేను కత్తి విసిరిన మాట నిజమే. కాని.. వాణ్ణి చంపాలన్న ఉద్దేశం ఏ కోశానా లేదు. గాయ పరిచి చట్టానికి పట్టిద్దామన్నదే నా ఆలోచన. చేతికి గురి చూస్తే కత్తి

గొంతులో దిగబడింది.." అని పశ్చాత్తాపం ప్రకటించాడు ఇంటి యజమాని. ఆయనకు పరమ శాంతపరుడిగా చుట్టుపక్కల మంచి పేరుంది. విచారణలో ఏ మాత్రం పొరపాటు జరిగినా అమాయకులు అన్యాయంగా బలైపోయే ప్రమాదం ఉంది.

రామశాస్త్రికి మొదటిసారి ధర్మసంకటం ఏర్పడింది.' న్యాయానికి భార్య ఉండీ.. పరాయిస్త్రీ కోసం వెంపర్లాడిన ఆ కాముకిడికి తగిన శిక్షే పడింది. కాని దాని పర్యవసానం అమాయకురాలైన వాడి భార్యమీదా పడింది. వ్యాపారి భార్యమీద ఆరోపించిన కాముకత్వానికి రుజువులు లేవు. చట్టప్రకారం శిక్షించడం కుదరదు. సహజన్యాయం దృష్టితో చూస్తే.. తన కాపురంలో నిప్పులు పోయబోయిన దుర్మార్గుడిని ఆత్మగౌరవం గల ఏ మగవాడూ ఉత్తిపుణ్యానికి సహించి వదిలి పెట్టలేడు. నిజంగా వాణ్ని చంపినా వ్యాపారికి పాపం అంటుకోరాదు.

కాని ఇది న్యాయస్థానం. న్యాయం ఇక్కడ కొన్ని చట్రాల పరిధిలో మాత్రమే ఇమిడి నిర్ధారింపబడుతుంది. కావాలని చేసినా.. అనుకోకుండా జరిగినా ఒక నిండుప్రాణం గాలిలో కలసిపోయింది. దానికి కారకుడైన వాడిని ఉపేక్షిస్తే సమాజం మొత్తానికి తప్పుడు సంకేతాలు వెళతాయి. ఇదే అదనుగా తన మీద గుర్రుగా ఉన్న తతిమ్మా న్యాయాధిపతులు మహారాజుగారికి ఫిర్యాదులూ చేయవచ్చు. తన తలను గురించి కాదు కానీ .. రాజ్యం మళ్ళీ పూర్వసంక్షోభంలో చిక్కుకుంటుందేమోనన్నదే దిగులు. ముందు ముందు సమాజానికి ఈ తలతో చేయవల్సిన సేవ ఎంతో వుంది. ఈ చిన్న కారణంగా ఆ పెద్ద సామాజికబాధ్యతనుంచి ఇలా తప్పుకోవాలనుకోవడం కార్యశీలుడి లక్షణం కాదు.'

ఆ రాత్రంతా ఎన్నో రకాలుగా ఆలోచించిన రామశాస్త్రి తెల్లారి చెప్పవలసిన తీర్పు మీద ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు. అప్పుడు గాని నిశ్చింతగా నిద్ర రాలేదు శాస్త్రికి.

మర్నాడు న్యాయస్థానంలో రామశాస్త్రి చెప్పిన తీర్పు ఎందరినో ఆశ్చర్య చకితులను చేసింది. ' ఘటన పుర్వాపరాలు అతి సూక్ష్మంగా పరిశీలించిన పిమ్మట ఈ నేరం మొత్తానికి పూర్తి బాధ్యులు దేశాన్ని ఏలే కృష్ణవర్మమహారాజు గారే అని నిర్ధారించడమైనది. దేశాంతరం పోయిన చిరువ్యాపారి చేసే పని తాను పండించిన కూరగాయలను కనీస ధరలకు అమ్ముకోవడం. దేశీయంగా తగిన మద్దతు దొరికితే ఎవరూ కుటుంబాన్ని అలా గాలికి వదిలి దేశాలు పట్టి పోరు.

మహారాజుగారి మరో నేరం మృతుడి దుర్మరణం. స్వయంకృషితో నిమిత్తం లేకుండా సంపదలు వచ్చి పోగుపడే మిడిమేళపు వర్గం ఒకటి దేశంలో వర్ధిల్లుతున్నది. వారికి పొద్దు గడవడమే పెద్ద ఇబ్బంది. తిన్నదా అరగదు. కొవ్వా కరగాలి. రకరకాల దోవల్లో యావలు తీర్చుకోవడానికి తాపత్రయాలు పడుతుంటారు. సంసార స్త్రీలను ఉచ్చులోకి లాగేది ఇలాంటి నడమంత్రపు సిరిపొగైన వాళ్ళే. చట్టాలు వీరికి చుట్టాలు. న్యాయం అంటే మహా అలుసు ఈ దుర్మార్గులకి. పాపాత్ములకి ఏ శిక్షలూ పడని ఈ అస్తవ్యస్త వ్యవస్థకూ సర్వోన్నతాధికారి అయినందు వల్ల మహారాజుగారే బాధ్యత వహించాలి'.

'కట్టుకున్న వాడితో కలసి బతుకును పండించుకోవాలన్న ఒక్క ఆశతో మాత్రమే లలన మెట్టినింట్లోకి అడుగు పెట్టేది. కలకాలం పక్కనే ఉంటానని ప్రమాణం చేసి మరీ చెయ్యందుకున్న మగవాడు కలలో తప్ప కనపడని దుస్థితి దాపురిస్తే పడతులందరూ ఒకే రీతిలో స్పందించరు. కడుపు నిండిన వాడు అన్నం దొంగిలిస్తాడా? బిడ్డ ఖాళీ కడుపుకి కన్నవారిది నేరం ఎలాగో.. ఏలిన వారి దోషం ఇక్కడ అలాగా'.

మూడు తప్పులకూ మూలకారణం మహారాజుల వారే కనక మరణ దండనే వారికి సరైన శిక్ష. నిందితుడే స్వయంగా, బహిరంగంగా మహారాజా వారి మీదకు కత్తి విసిరాలి. ఆ తరువాత ఆ నేరంమీద వ్యాపారికీ యథేచ్ఛగా ఉరిశిక్ష అమలు చేయవచ్చు. హతుడి భార్య కోరుకుంటున్న న్యాయం కూడా అప్పుడే సాధ్యమని ఈ న్యాయస్థానం భావిస్తున్నది'

రామశాస్త్రి తీర్పు పుట్టించినంచిన కలకలం అంతా ఇంతా కాదు. ప్రజలు తీర్పుకి అనుకూలంగా.. ప్రతికూలంగా రెండు వర్గాలుగా చీలి వాదులాడుకోవడం మొదలు పెట్టారు. అంశం మహారాజుగారి మరణదండనకు సంబంధించింది కనక ఆ చర్చల ప్రభావం సమాజంలోని అన్ని వర్గాల మీద తీవ్రంగా ఉంది. తీర్పులో ప్రస్తావించిన దేశీయ వ్యాపార ధోరణులు.. కలవారి విచ్చలవిడి తరహా బతుకులు.. ఆడవారి జీవితాల్లో జరుగుతున్న అన్యాయాల్లాంటి ఎన్నో సామాజిక సమస్యలు మేదావివర్గాల చర్చల్లో నలిగి నలిగి సామాన్యుల్ల అవగాహనా స్థాయి పదును తేలింది. న్యాయస్థానాల్లో, శాంతిభద్రతల రక్షణ యత్రాంగాల్లో అప్పటి వరకూ లోపాయికారీగా సాగుతోన్న అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతం లాంటి ఎన్నో రుగ్మతలు ఇప్పుడు నిర్భయంగా బహిరంగ చర్చకు గురవుతున్నాయి.

రామశాస్త్రి కోరుకున్న చైతన్యం కూడా అదే.

మహారాజుగారూ 'తీర్పుకి కట్టుబడి ఉంటాన'ని ప్రకటించడంతో చట్టం ముందు అందరూ సమానమేనన్న సందేశం అత్యంత బలంగా సమాజానికి అందించినట్లయింది. న్యాయవ్యవస్థ పక్షపాతం మీద అప్పటిదాకా ధనికవర్గాలకున్న ధీమా మొత్తం ఒక్కసారి కుప్పకూలింది.రామశాస్త్రి తీర్పు అమలు చేయాల్సిన క్షణాలు రానే వచ్చాయి. బహిరంగ వధ్యశిల ఏర్పాటు చేయబడింది. రాచపరివారం సమస్తం వెంటరాగా మహారాజు గారు శిక్షాస్థలికి అట్టహాసంగా తరలి వచ్చారు.

శిక్షలు విధించడమే తప్ప శిక్షలు అనుభవించే వ్యవస్థ రాచరికానికి కొత్త. చరిత్రలో సైతం ఎక్కడా జరిగినట్లు విని ఉండని అపురూప దృశ్యాన్ని తిలకించడానికి ఎక్కడెక్కడి జన సమూహాలో విరగబడి వచ్చాయి. .

ఎక్కడ విన్నా మహారాజుగారి మంచితనాన్ని గురించిన స్మరణే. ప్రజలను కన్నబిడ్డల్లాగా పాలించే కృష్ణవర్మ మహారాజస్థానాన్ని వారసులు ఎంతవరకు పూరిస్తారోనన్న నిరాశ. మహారాజుగారి పాలనలో కొన్ని పొరపాట్లు జరిగితే జరిగి ఉండవచ్చు. రామరాజ్యానికే ఈ మచ్చ తప్పలేదని రామాయణం చెబుతోంది. రాములవారికి ఇలాంటి దారుణమైన శిక్ష పడిందా?

చర్చలు ఇలా పలురకాలుగా సాగుతుండగానే.. చీకటి పడింది. తీర్పులో విధించబడిన సమయానికి సరిగ్గా వ్యాపారిని మరణ వేదిక మీదకు తీసుకొచ్చారు. అతని చేతికి ఒక కత్తి ఇచ్చారు.

ఎదురుగా తలమీద ముసుగుతో చక్రవర్తులు.. ప్రాణాలు అర్పించడానికి సిద్ధబడి ధీరోదాత్తంగా నిలబడి వున్నారు.ప్రకటన వెలువడింది "వ్యాపారీ! తీర్పు ప్రకారం నువ్వు మహారాజుగారి మెడమీదకు ఈ కత్తి విసరాలి. ఒకే ఒక్క వేటుతో మహారాజుగారి ప్రాణాలు పోవాలి. విసురూ!" అంతటా హాహాకారాలు.

వణవణా వణుకుతూ చేతిలోని కత్తి బలంగా విసిరాడు వ్యాపారి . గురి తప్పనే తప్పింది. మెడకు తగలాల్సిన కత్తి భుజానికి రాసుకుని కింద పడింది. తీర్పులో వ్యాపారికి ఇచ్చింది ఒకే ఒక్క అవకాశం కనక మహారాజుగారు సురక్షితం.అంతటా ఆనందంతో కేరింతలు.ప్రజాభిమానానికి కదలి పోయారు కృష్ణవర్మ మహారాజు. ఇంతగా ప్రేమించే ప్రజలకు ఏమిస్తే రుణం తీరేను? జన సంక్షేమానికి మరింత ప్రాధాన్య మివ్వాలని ఆ క్షణంలోనే కృతనిశ్చయానికొచ్చారు మహారాజు.

ఇదంతా రామశాస్త్రి చిత్రమైన తీర్పు కలిగించిన బుద్ధివికాసం. "నిజమే కానీ.." అంటూ అప్పటి వరకూ తనను తొలుస్తున్న సందేహాన్ని రామశాస్త్రి ముందు బైట పెట్టారు మహారాజా వారు " అర్ధరాత్రి పరాయి యింట్లోకి ఆ దుర్మార్గుడు దూరింది ఎందుకో నిర్ధారణ కాలేదు. ఆ ఇంటి ఇల్లాలు చరిత్ర ఎంత స్వచ్ఛమైందో రుజువు కాలేదు. వ్యాపారి 'దుర్మార్గుడిని కావాలని చంపలేదు.. నిర్దోషిన'ని బుకాయిస్తున్నాడు. ఆ మాటల్లోని నిజాయితీ పాలు నిగ్గు తేల్చలేదు. తప్పు చేసిన వాళ్ళందరిని గాలికి వదిలేసి సంఘటనతో ఏ మాత్రం సంబంధం లేని... నాకా శిక్ష? వ్యాపారి సుశిక్షితుడైన యోధుడు కాకపోబట్టి తడబడ్డాడు. లేకపోతే.."

మధ్యలోనే అందుకొని ముగించాడు రామశాస్త్రి "అతను తడబడ లేదు మహారాజా! గురి చూసే విసిరాడు. అది తప్పింది. అతని గురే అంత. కుడికన్నులో దృష్టిలోపం ఉంది. ఆ లోపం కారణంగానే ఆ రోజు రాత్రి ఈ వ్యాపారి చేతిలో ఆ దుర్మార్గుడి ప్రాణాలు పోయాయి. దుర్మార్గుణ్ని గాయ పరిచి వదిలేద్దామన్న ఉద్దేశంతోనే వ్యాపారి కత్తి విసిరిని మాట వాస్తవమే. దృష్టిలోపం దుర్మార్గుడి ప్రాణాలు పోవడానికి కారణం అయింది. నిజానికి అలాంటి నీచులు బతికి ఉండటం వల్ల అమాయకులకే మాత్రం మనశ్శాంతి ఉండదు. వ్యాపారి భార్య ఒంటరిగా ఉండటం చూసి, నాశనం చేయాలన్న దుర్బుద్ధితోనే వాడు చీకటి

మాటున చాటుగా వచ్చి పడక గదిలో దూరాడు. ఆ పాపంలో ఆమెకే భాగం లేదు. ఆ కాముకుడి చరిత్ర.. ఆ ఇల్లాలి చరిత్ర వాకబు చేయించిన తరువాతనే నేనీ రకమైన శిక్ష ఖరారు చేసింది.'

'సంఘటన విచారణకు వచ్చినప్పుడు ఆ వ్యాపారికి శిక్ష పడుతుందనే అందరూ భావించారు. సాక్ష్యాలనీ అతనికి వ్యతిరేకంగా ఉన్నాయి మరి. నా మనస్సాక్షి ఒక్కటే అతడికి అనుకూలం. వాకబు చేసిన మీదట నా నమ్మకం నిజమని తేలింది. కానీ సాక్ష్యాలుగా అవి చాలవు. వ్యాపారిని శిక్షించకుండా వదిలేస్తే నా తల కోటగుమ్మానికి వేలాడితే చూడాలని వువ్విళ్ళూరే వాళ్ళకు అవకాశం ఇచ్చినట్లవుతుంది. ఇప్పటి వరకూ ఈ వ్యవస్థను భ్రష్టుపట్టించిన వాళ్ళు వాళ్ళంతా. ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితులు చక్కబడుతున్నాయి. నా తలను గూర్చి నాకు బెంగ లేదు కానీ.. తమ మంచితనం వల్ల నాకు దక్కిన ఈ అవకాశాన్ని సమాజ హితం కోసం మరింత పదునుగా వాడాలని ఆత్రం మాత్రం ఉంది. ముందు ముందు నా విరోధులు మీ మనసు విరిచే ప్రమాదం ఉంది. అందుకే .. ఏ సంబంధం లేకపోయినా ఈ వ్యవహారంలో మిమ్మల్ని కూడా ఇరికించవలసి వచ్చింది. మీ ముందు అనుమతితోనే అనుకోండి. వ్యాపారి దృష్టిలోపం మీద ఒకసారి మీకు నమ్మకం కుదిరితే .. ఇక ఎవరు ఎన్ని చెప్పినా మీరు నా తీర్పుని శంకించరన్న నమ్మకమే నా చేత ఈ సాహసం చేయించింది. మీ సహృదయత వల్లే ఇది సాధ్యమైంది. ఇదీ నా సంజాయిషీ. ఇప్పుడు మీరే శిక్ష విధించినా శిరసావహించడానికి సిద్ధం మహారాజా!"

మందహాసం చేసి అన్నారు మహారాజు "నాకు ఇంత పెద్ద శిక్ష విధించిన వాడిని వూరికే వదిలి పెట్టడం కల్ల. శిక్ష ఖాయం. అమలుకు గడువు దాకా వేచి చూడటం దేనికి? రేపే ముహూర్తం. సామాన్యులకు మా ద్వారా మరింత న్యాయం జరిగే అవకాశం ఇవ్వండి! మా ముఖ్య సలహాదారులుగా చేరడమే మీకు తగిన శిక్ష " అంటూ ఆప్యాయంగా రామశాస్త్రిని ఆలింగనం చేసుకున్నారు కృష్ణవర్మ మాహారాజు .*



‘‘ లోకల్ ట్రెయిన్లలోనూ ఈ ఆకతాయిల బెడద తప్పటం లేదు. రోజూ రైలుప్రయాణం విసిగెత్తిస్తోంది....

రైలు ప్లాట్ ఫారం మీదకు వచ్చి రాగానే.. గబుక్కున లోపలకి ఎక్కాను. గుమ్మం దగ్గర ఎవరో కావాలనే నన్ను తాకారనిపించింది. ఇబ్బందిగా అనిపించినా పట్టించుకోకుండా ముందుకు నడిచాను.

కంపార్టుమెంటంతా కిక్కిరిసిపోయి ఉంది. మనిషి అటూఇటూ కదలటానికి చోటులేదు. మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా బోగీ ఉన్నా అది సరిపోక మామూలు బోగీల్లో ఎక్కక తప్పటం లేదు.

ఏదో స్టేషనులో రైలు ఆగినట్టుంది.

చాలా మంది ఎక్కారు.

మనిషి నిలబడే సందు లేదు. ఫ్యాను గాలి అందటం లేదు. చెమటతో తడిసి శరీరం ముద్దయిపోయింది. మగవాళ్లమధ్య నిలబడటం ఇబ్బందిగా ఉంది.

కాస్త తేరిపార చూస్తే.. దూరంగా బుర్ఖా ధరించి ఉన్న కొందరు ఆడవాళ్లు గుంపుగా ఓ చోట నిలబడి కనిపించారు.

మెల్లగా జనాల్ని దాటుకుంటూ అక్కడికి చేరాను.

ఏ మాటకామాట చెప్పుకోవాలి.ఇరుకు రోడ్ల మీద అడుగడుగునా ట్రాఫిక్ జామ్ లను ఎదుర్కొంటూ.. సిటీ బస్సుల్లో గంటల తరబడి ప్రయాణించటం కంటే ఈ లోకల్ ట్రెయిన్లు సౌకర్యవంతం.

మూడునిముషాలకోమారు రైలు ఆగటం.. మళ్లీ కదలటం .. చకచకా స్టేషన్లు కదలుతున్నాయి.

నా వెనక ఎవరో తాకుతున్నట్టనిపించింది. గబుక్కున తలతిప్పి చూశాను.

ఎవరూ కనిపించలేదు.

అందరూ బుర్ఖాల్లో ఉన్న మహిళలే.

నేను అలా చూడటం వల్లనేమో.. కాస్త సర్దుకున్నారు.

'హమ్మయ్య .. అని . నేను స్థిమితపడేలోగా.. మళ్లీ ముందుకొచ్చారు.

రైలు కుదుపులకి అన్నట్టు.. వెనక్కి జరిగినట్టే జరిగి ఈసారి దాదాపుగా నన్ను ఆనుకుని నిలబడ్డారు

చేతుల్ని ..నడుం మీదుగా.. సీటు మీదకు జార్చి.. .. ఏదేదో చేస్తున్నారు.

" అక్కడున్నది అందరూ ఆడవాళ్లే. మగవాళ్ల కంటే అదో రోగం. ..వీళ్లకేమొచ్చింది... "చిర్రెత్తుతోంది నాకు.

అటూ ఇటూ కదలటానికి లేదు. పూర్తిగా బంధించినట్టుగా ఉంది.

ఓపికపట్టలేకపోతున్నాను.

శరీరంమీద విషపురుగు పాకిన భావన. అంతే..నా చేతిని వెనక్కి జరిపి... అవతల చేతిని విసురుగా ఓ నెట్టు నెట్టాను."
ఎవరది.. దూరంగా జరగండి. మనిషి మీద నుంచుని గానీ ప్రయాణం చేయలేరా?"

గట్టిగా కేకలేశాను. అంతకు ముందెప్పుడూ అంత గట్టిగా మాట్లాడి ఎరగను.

ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు.

క్షణాల్లో నాకు కుడి వైపున బుర్ఖాలు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు తమ ముసుగులు తొలగించి... నా వెనక ఆనుకుని నిలబడి ఉన్న వ్యక్తిని దొరకపుచ్చుకుని గుంపులో నుంచి బయటకు లాగారు.

ఒక్కసారిగా కలకలం రేగింది. అక్కడేం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి.

'ఈ ఇద్దరూ మహిళా పోలీసులేమో'నాకు అర్థం కాలేదు.

పిడికిలి బిగించి ఆ వ్యక్తి కడుపులో గుద్దారు.'' రాస్కెల్.. ఇన్నాళ్లకు దొరికావు.. నీ దోస్తు వాడేడీ..'' నిలదీశారు.వాడు విలవిలలాడుతూ.. పక్కనున్న బుర్ఖా వ్యక్తిని చూపించాడు.ఇద్దరిని పక్కపక్కన నుంచో పెట్టి.. బలవంతంగా వాళ్లిద్దరి ముసుగులు తొలగించారు.ఇద్దరికీ పాతికేళ్ల లోపుంటాయి. నల్లగా ఉన్నారు. చూడగానే రౌడీ వెధవలన్న భావం కలుగుతుంది ఎవరికయినా.

''ఈ బుర్ఖాలు వేసుకుని వచ్చి ఆడవాళ్లలో చేరి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నమాట'' అనుకున్నాను.

''ఆడవాళ్లలో కలిసిపోయి బంగారం, డబ్బులు లాంటివి దొంగిలించటం వీళ్లకి అలవాటు. గంట క్రితం ఎవరో తమ పాప నెక్లెస్ పోయిందని ఫిర్యాదు చేశారు. ఈ బోగీలోనే వీళ్లు ఉన్నట్లు గుర్తించి వలపన్నాం... ' అన్నారు ఆ ఇద్దరు మహిళలు.'' మమ్మల్ని చూడగానే జారుకుంటారని.. మేం కూడా వీళ్లలాగే బుర్ఖాలు ధరించి వచ్చాం'' అన్నారు.

'' మొత్తానికి భలే పట్టేశారు'' ప్రశంసాపూర్వకంగా అన్నారెవరో...

“నిజమే. గొప్పవిషయం. అయితే అందరూ బుర్ఖాల్లో ఉంటే..

దొంగల్ని ఎలా కనిపెట్టగలిగారో?” సందేహం వచ్చిందినాకు.

దానికి వాళ్లిద్దరే సమాధానం చెప్పారు.“ఆ ఆకతాయిలిద్దరూ ఆడవాళ్లలా బుర్ఖా ధరించినా.. సాధారణంగా మగవాళ్లు వాడే హవాయి చెప్పులు వేసుకున్నారు. ఈ చెప్పుల్ని బట్టే గుంపులో ఉన్నా వీళ్లు మగవాళ్లని సునాయాసంగా గుర్తించగలిగారట.కేసు ఛేదించి దొంగల్ని పట్టుకోగలిగామన్న విజయగర్వం వారి మాటల్లో తొంగి చూస్తోంది.

“ గతంలో ఓ సారి ముంబయ్ లోకల్ ట్రెయిన్లలో కూడా దొంగలు సరిగ్గా ఇలాగే పట్టుపడ్డారు. వీళ్లని పట్టుకోటానికి ఇదే వ్యూహాన్ని అమలు చేశాం” అన్నారు.

వాళ్ల తెలివి తేటలకు మేం ముచ్చట పడ్డాం.“ మేము ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన షీ- బందం సభ్యులం.మేం పోలీసు దుస్తులు ధరించం. అందరి మధ్యలోనే తిరుగుతూ నేరగాళ్ల ఆనుపానులు కనిపెడతాం. ఆడవాళ్లతో అసభ్యంగా ప్రవర్తించే వారెవరయినా సరే అంతు చూస్తాం”.. అన్నారు.

స్టేషన్ రాగానే ఆకతాయిలిద్దరిని దింపి తమ వెంట తీసుకుపోయారు.నాకు థ్రిల్లింగ్ గా అనిపించింది.పోలీసులు ఇలాంటి చర్యలు తరచూ చేపడితే తప్ప...

ఈవ్ టీజింగ్ కేసులు తగ్గుముఖం పట్టవు” అనుకుంటూ వాళ్లు వెళుతున్న వైపు అలా చూస్తుండిపోయాను.




అది ఒక ఎత్తైన కొండ. దాన్ని తాకుతూ పారుతోంది ఒక జలపాతపు ధార. పొద్దున మొదలెట్టి ఎలాగో కష్టపడి ఆ కొండ ఎక్కేసాను. ఈ కొండ ఎక్కింది రికార్డు లు బద్దలు కొట్టడానికి కాదు. పై నుంచి దూకి జీవితాన్ని అంతం చేసుకోడానికి వచ్చిన ఒక సాధారణ మనిషి నేను. ఆత్మహత్య చేసుకోడం తప్పు అని తెలిసినా తప్ప లేదు. ఈ జీవితం పెట్టిన కష్టాలు కన్నీళ్లు తెప్పించాయి. ఈ సమాజం చేసిన నష్టాలు మానసిక క్షోభ కి గురి చేసాయి. నీళ్ళు లేక బోర్లు ఎండిపోయినట్టు కన్నీళ్లు రాక నా కళ్ళు పొడిబారిపోయాయి. వర్షా కాలం ఎండలు మండినట్టు గుండెల దగ దగ మండి పోయింది. జీవితం మీద విరక్తి తో చావు నే పరిష్కారం గా ఎంచుకున్నాను. నా చావు న్యూస్ ఏ టివి చానల్ లో telecast అవ్వొద్దు, బ్రతికున్నప్పుడు చూపని సానుభూతి చనిపోయాక ఎక్కువగా చూపించే సమాజానికి నా చావు అందనంత దూరం గా వచ్చాను. కొండ చివరన నిలుచున్నాను. ఊపిరి గట్టిగా పీల్చుకున్నాను. దూకడానికి కావల్సిన ధైర్యం గుండెల నిండా నింపుకున్న. సరిగ్గా అప్పుడే ఇలాంటి జీవితం ఇచ్చిన దేవుడు గుర్తొచ్చాడు. ఆకాశం వైపు కోపం గా చూసాను.

ఓ దేవుడా నువ్వు ఎక్కడ వుంటావో ఎవరికీ తెలీదు. నువ్వు గుర్తుకు వచ్చినప్పుడు నీ కోసం అందరూ ఆకాశం వైపు చూస్తారు. నువ్వు నిజం గా వుంటే నా శాపం నీకు తప్పకుండా తగులుతుంది. ఒక్క సారి మధ్య తరగతి మనిషి గా పుట్టి చూడు తెలుస్తుంది మేము ఇక్కడ పడే కష్టాలు. ఆల్రెడీ పుట్టాను అంటావు ఏమో!. భూమి మీద కూడా మళ్ళీ దేవుడి గా పుట్టడం కాదు, మనిషి లా అంటే నాలా పుట్టి చూడు తెలుస్తుంది. ఎందుకయ్యా నన్ను పుట్టించి చేతులు దులిపేసుకున్నావు. పుట్టిన రోజే అమ్మని తీసుకొని

వెళ్లావు. అమ్మ పాలు తెలియదు, మురిపాలు చూడనివ్వలేదు. చేయి పట్టుకొని నడిపించాల్సిన వయస్సులో నాన్న ని తీసుకొని వెళ్లిపోయావు. దారి చూపించే నాన్న లేక ఎక్కడంటే అక్కడ నడిచి కాళ్ళకి ముల్లు గుచ్చుకొని రక్తం కారుతున్నా కనికరం కలగ లేదు నీకు. ఇక అమ్మ నాన్న లేరు అనగానే బంధువులు కూడా రాబంధువులు అయిపోయారు. నేను ఎవరో తెలియనట్టే నటించారు. కనీసం నా బాధ్యత తీసుకోలేదు సరి మిగిలిన ఆస్తి ని మా నాన్న వాళ్ళ దగ్గర చేసిన అప్పుకు కి సమం చేశారు. నన్ను అనాధశ్రమం లో చేర్పించి ఒంటరి వాడిని చేసారు. ఎంత ఏడ్చానో కదా! ఒక్క సారి కూడా నీ మనస్సు కరగలేదా! దేవుడివి నువ్వు రాలేవు సరే .. నా చుట్టూ వున్న ఎవరైనా ఓదారుస్తారు అని చూసాను. నాకన్నా వాళ్ళే ఇంకా ఎక్కువ ఏడుస్తున్నారు. ఆశ్చర్యం కలిగించే లా రెండు చేతులు నా కన్నులు తుడిచాయి. ఎందుకు తమ్ముడు ఏడుస్తున్నావు అని ప్రేమ గా పలకరించాయి. అమ్మ కోసం అని చెప్పడానికి అమ్మ ప్రేమ ఎరుగను. నాన్న సగం లోనే తిరిగి రాని లోకం కి వెళ్లిపోయాడు అని కోపం. నా తలరాత ని ఆయనకే అర్ధం కాకుండా వ్రాసాడు అని దేవుడి మీద నమ్మకం లేదు. ఎందుకోసం ఏడుస్తున్నానో తెలియకుండానే ఏడుస్తున్నాను. ప్రేమగా పలకరించిన ఆ అక్క చేతులు నాకు మొదటి సారి గోరు ముద్దలు తినిపించాయి. మళ్ళీ కన్నీళ్లే వచ్చాయి. కానీ అవి ఆనంద బాష్పాలు అని ఆ వయస్సులో నాకు తెలిదు. ఒడి లో పడుకోపెట్టుకొని జోల పాడింది. నా జీవితం నాకు మళ్ళీ దక్కినట్టే అనిపించింది. ప్రేమ గా ఒక్కరు పలకరించినా జీవితం మీద మళ్ళీ ఆశ కలుగుతుంది అనిపించింది.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలిదు. అర్ధ రాత్రి మెలుకవ వచ్చింది. కళ్ళు తెరిచి చూస్తే మొత్తం చీకటి. అక్క అని పిలిచాను. సమాధానం లేదు. పక్కనే లేదు. చీకటి లోనే గోడ ని సాయం చేసుకొని ముందుకు నడుస్తున్నాను. ఒక కిటికీ దగ్గర కొంచెం వెలుతురు కనిపించింది. అటువైపు అడుగులు వేసాను. కిటికీ లోంచి వెలుతురు వైపు చూసాను. మొట్ట మొదటి సారి చీకటి లోంచి వెలుతురు ని చూసి భయం వేసింది. అక్కడ ఏమి జరుగుతుందో అర్ధం చేసుకొనే వయస్సు లేదు. నన్ను ప్రేమ గా పలకరించిన మనిషి మీద ఒక పశువు దాడి చేస్తోంది. నన్ను ఏడవొద్దు అని ఊరడించిన మనిషి వెక్కి వెక్కి ఏడుస్తోంది. అయినా ఆ పశువు కనికరించడం లేదు. చిన్న పిల్లని సారు నన్ను వదిలేయ్యండి అని బ్రతిమాలుతోంది. పశువు రూపం లో వున్న ఆ మనిషి కి ఆడపిల్ల కనిపిస్తోంది కాని చిన్న పిల్ల అనిపించడం లేదు. అలసిపోయినట్టుంది కళ్ళు మూతపడ్డాయి. శాశ్వతం గా మూతపడ్డాయి. ఆ పశువు అలానే పడుకుంది. అది చూసి నేను అక్కడే పడిపోయాను. పొద్దునే కళ్ళు తెరిచేసరికి ఏదో హడావుడి కనిపించింది. మొట్ట మొదటి సారి పోలీసు ని చాలా దగ్గరగా చూసాను. న్యాయాన్ని రక్షించడమే వాళ్ళ పని అని ఊహ సరిగ్గా తెలియని వయస్సు లో మా నాన్న చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ఒక పోలీసు నా దగ్గరకి వచ్చాడు. నా ఎత్తుకు సరిపోయేలా నా ముందు కూర్చున్నాడు. రాత్రి ఏమి జరిగిందో చూసావా అన్నాడు. అవును అని నేను ఊపుతున్న తల ని మధ్య లోనే తన రెండు చేతుల తో గట్టిగా పట్టి ఆపేసాడు. నువ్వు ఏమి చూడ లేదు. చూసినా అది ఇప్పుడే ఈ క్షణమే మరచిపోయావు. ఒక చాక్లెట్ నా నోట్లో వేసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మొట్ట మొదటి సారి అలా నోట్లో వేసుకున్న చాక్లెట్ చేదు గా అనిపించింది. వెంటనే ఉమ్మేసాను. ఆంబ్యులెన్స్ సౌండ్ విని ఆ వైపు పరిగెట్టాను. అందులోకి నన్ను ప్రేమ గా పలకరించని అక్క వెళ్లిపోతోంది. నా వైపే చెయ్యి చాపి నన్ను కూడా రమ్మని పిలుస్తున్నట్టు అనిపించింది. అప్పుడు నాకు అర్ధం కాలేదు. నేను మళ్ళీ అనాధనే. మళ్ళీ ఏడుపు వచ్చింది. ఈ సారి నా చేతులే కన్నీళ్లని తుడిచేసాయి.

ఇక అప్పటి నుంచి జీవితం అలవాటు చేసుకోవడం మొదలుపెట్టాను. అర్ధం చేసుకోవడానికి ప్రయత్నించాను. నడిచేప్పుడు పడిపోతే లేచి నొప్పి తెలియకుండా కసి గా పరిగెట్టే వాడిని. తినే అన్నం లో నిర్జీవం గా వున్న పురుగుల్ని పక్కకి నెట్టేసి తినడం

అలవాటు చేసుకున్నాను. ఆ తర్వాత ఎప్పుడైనా రాత్రి పూట మెలుకవ వచ్చినప్పుడు కిటికీ లోంచి వస్తున్న వెలుతురు వైపు వెళ్ళాలి అనిపించ లేదు. ఎందుకంటే నా తో పాటు దేవుడు వి నువ్వు కూడా చూస్తున్నావు కదా! నిజం ఏంటో నీకు బాగా తెలుసు. చెడు ని ఆపాల్సిన బాధ్యత నీకు లేదా? పేరు కి అనాధ ఆశ్రమం. అక్కడ ఎన్నో అక్రమాలు జరిగేవి. అవి అర్ధం చేసుకొనే వయస్సు లేదు. బయటకి పారిపోయి బతకొచ్చు అని తెలీదు. నాకన్నా కొంచెం వయస్సు లో పెద్దయిన కొందరు పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. నన్ను కూడా ఆడమన్నారు. బంతి అందకుండా ఎక్కడైనా పడితే తీసుకొని వచ్చి ఇవ్వడం. అదే నేను ఆడాల్సిన ఆట. ఒకడు గట్టిగా కొట్టిన బంతి మేనేజర్ రూమ్ లో విలువైన వస్తువుల్ని పగల గొట్టింది. బంతి ఎవరు కొట్టారు అంటే కొట్టిన వాడి తో సహా అందరి నోళ్ళు మూసుకుపోయాయి. బంతి కోసం వెళ్ళిన నా చంప మాత్రం పగిలింది. మొదటి సారి తప్పు నాది కాదు అని ఎదురు తిరిగాను. మరుక్షణమే ఆశ్రమం నుంచి గెంటివేయ బడ్డాను. గేట్ అవతల నేను. గేట్ దూకి లోపలికి వెళ్లినా మిగతా అనాధల్లో నేనొక అనాధ ని. వెనక్కి తిరిగి వెళ్లినా కోట్ల మంది జనాభా లో కూడా అనాధ నే అని వెనక్కి వెళ్ళిన నాకు తెలియడానికి ఎన్నో రోజులు పట్టలేదు.

ఒంటరి గా తిరిగాను. అప్పుడప్పుడు నాతో తోడు వస్తాను అని కుక్కలు వెంబడించాయి. చెత్త కుప్పల్లో నాతో కలిసి తినేవి. పార్క్ లో పడుకొనేవాడిని. ఒక్కో సారి Platform మీద, footpath, పార్క్ బెంచ్ ల మీద ఆ సమయం లో ఎక్కడ వుంటే అక్కడే పడుకొనే వాడిని. ఒక్కోసారి పిర్ర మీద గట్టి లాఠీ దెబ్బ తో లేచే వాడిని. ఇక్కడ పడుకోకూడదు లే అని తరిమేసేవాళ్ళు. మరి ఎక్కడ పడుకోవాలి అని గట్టిగా అడగాలి అనిపించేది. ఒక సారి అలానే అడిగితే రెండో పిర్ర మీద కూడా పీకారు. ఆ రోజు నేను పడుకున్న ప్లేస్ పక్కనే ఒక ఏటిఎం వుంది. దాన్ని దోచుకోడానికి ఒక దొంగల ముఠా వచ్చింది. వాళ్ళని నేను చూసాను. వాళ్ళు కూడా నన్ను తిరిగి వెళ్ళేప్పుడు చూసారు. అక్కడ నేను వుండడం నా తప్పు అయ్యింది. నేను పోలీసు లకి ఎక్కడ చెప్పేస్తాను అని నన్ను కూడా పట్టుకెళ్లిపోయారు. అప్పటి నుంచి వాళ్ళు చేసిన ప్రతి దొంగతనం లో నాకు కూడా వాటా వుంది. దొంగతనం చెయ్యడం లో మాత్రమే వాటా. దోచుకున్న దాంట్లో వాటా లేదు. చిన్న పిల్లాడ్ని అని లోకువ. తినడానికి పెట్టేవాళ్లు. అది అరిగేదాక పని చేయించుకొనే వాళ్ళు. దొంగతనం తో పాటు భయంకరమైన నేరాలు చేసేవాళ్ళు. రాత్రి పూట ఇళ్లపై దాడి చేసేవాళ్ళు. మానం , ప్రాణం, ధనం అన్నీ దోచుకొనేవాళ్లు. అప్పుడు కూడా నేను ఏమి అనే వాడ్ని కాదు. ఎందుకు అంటే? నాతో పాటు దేవుడు కూడా ఇవన్నీ చూస్తూ వుంటాడు కదా! కొన్ని రోజులకి ఆ ముఠా దొరికిపోయింది. వాళ్ళ తో పాటు నేను కూడా. నన్ను బాల నేరస్తులు వుండే జైల్ కి పంపారు.

అదే నా జీవితం లో నువ్వు చేసిన మంచి పని అని నాకు అనిపించింది. చదువుకొనే అవకాశం వచ్చింది. అక్కడ కూడా కష్టాలు వున్నాయి. కాని ఆ కష్టాలు దాటి నన్ను ఏదో శక్తి ముందుకు నడిపింది. జైల్లోనే చిన్న చిన్న పనులు చేసాను. ఎన్ని ఆటంకాలు వచ్చినా మంచి గా నడుచుకున్నాను. జైల్ అధికారులు కూడా సహాయం చేసారు. అక్కడే పెరిగి పెద్దవాడినయ్యాను. ప్రయోజకుడినయ్యాను. కాదు ఒక జిల్లా కి కలెక్టర్ అయ్యాను. నేను పుట్టిన ఊరు ఆ జిల్లా లోనే వుంది. నాకు చాలా కసి గా అనిపించింది. చాలా మంచి చెయ్యాలి అనిపించింది. నేను మొదట అడుగు వేసిన అనాధశ్రమం నుంచి అది మొదలు పెట్టాను. ఒకప్పుడు చిన్న పిల్లాడిని. ఎవరు నా మాట వినలేదు. ఇప్పుడు నేను ఈ జిల్లా కి రాజు ని. నేను ఏది చెప్పినా అది చేస్తున్నారు. అందరూ నన్ను దేవుడి లా చూస్తున్నారు. చాలా సంతోషం గా వుంది. పెళ్లి సంబంధం కూడా కుదిరింది. నన్ను దేవుడు అనడం దేవుడి వి అయిన నీకు నచ్చ లేదు కదా! అందుకే నా జీవితం లోకి మళ్ళీ కష్టాల్ని వదిలావు. కనిపించకుండా ఆటలాడి నన్ను

అగాతం లో పడేసి నవ్వుకుంటున్నావు కదా! వస్తున్నా చనిపోయి నీ ముందుకు వస్తున్నా. నా జీవితానికి సమాధానం చెప్పడానికి సిద్ధం గా వుండు. కళ్ళు మూసుకొని లోయలోకి దూకేసాడు.

అప్పుడు గుర్తుకు వచ్చింది. తాను మంచి చేద్దాం అని చూస్తుంటే, తనని అడ్డుకున్న దుష్ట శక్తులు, వాళ్ళు పన్నిన కుయుక్తులు. పేదోడి కోసం అని కొత్త పథకాలు ప్రవేశ పెడుతారు. అవి ఎలా మింగేయ్యాలని మళ్ళీ పథకాలు వేస్తారు.. తప్పు అని నిలదీసిన నాదే తప్పు. కావల్సినంత డబ్బు ఇస్తాం అన్నారు. నాకు ఆ జబ్బు లేదు అన్నాను. చంపేస్తాం అని బెదిరించారు. నాకు చావు అంటే భయం లేదు అని చెప్పాను. ప్రమోషన్ వచ్చేలా చేస్తాం అని ప్రలోభ పెట్టారు. మనిషి గా బ్రతికితే చాలు అన్నాను. నువ్వెక్కడ మనిషివి అన్నారు. ఒక చిరు నవ్వు సమాధానం గా ఇచ్చాను. దాన్నే దోచేసుకునారు. నన్ను పెళ్లి చేసుకోవాల్సిన అమ్మాయిని నీ దగ్గరకి పంపించేశారు. నేను మళ్ళీ అనాధనే. నా చుట్టూ వల పన్నారు. మోసం చేసి నన్ను దోషి ని చేసారు. ఉద్యోగం పోయింది. దేవుడు అన్న ప్రజలే మోసగాడు అన్నారు. నేను చేసిన తప్పు మంచి చెయ్యాలి అనుకోవడమే! ఇదంతా చూస్తూ నువ్వు ఎప్పటిలాగే నిశ్శబ్దం. ఉలకవు పలకవు. అందుకే నీ దగ్గరకు వచ్చేయ్యాలి నిర్ణయించుకున్నాను. నా ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి సిద్ధం గా వుండు. పెద్ద శబ్దం. వెంటనే కాసేపు నిశ్శబ్దం. అంతా చీకటి. కళ్ళు తెరిచాడు. దూరం గా ఏదో వెలుతురు. చూడలేక పోతున్నాడు. గట్టిగా ప్రయత్నించాడు. ఎదురు గా ఎవరో మనిషి నిలబడి వున్నాడు. చాలా ప్రశాంతం గా వున్నాడు. ఎవరు నువ్వు? నువ్వు పిలిచావు అని వచ్చాను అని సమాధానం. నీ కోసం ఇంత దూరం వచ్చాక ఇలా అంటున్నావు. నేను ఎవరినీ పిలవ లేదు. నాకు ఎవ్వరూ లేరు. నేను ఒక అనాధని. నా మీద ఎందుకు అంత కోపం అని అతను అన్నాడు. నాకు ఎవరి మీద కోపం లేదు అన్నాను. దేవుడి మీద కోపం అన్నావు కదా! అంటే నువ్వు దేవుడి వా. దేవుడు చిన్నగా నవ్వాడు. నేను బోరున ఏడ్చాను. నన్ను దగ్గరకి తీసుకొని గట్టిగా గుండెలకి హత్తుకున్నాడు. అది భూమి మీద పడ్డ కష్టాలన్నీ మరచి పోయేలా చేసింది. నా చేయి పట్టుకొని అక్కడ నుంచి దూరం గా తీసుకొని వెళ్ళాడు.

అదొక అద్భుతమైన ప్రదేశం. చుట్టూ జల పాతాలు. పచ్చని చెట్లు. అందమైన పూల మొక్కలు. ఇక నువ్వు ఇక్కడే వుండొచ్చు అన్నాడు. అక్కడ కనిపించిన ప్రతి మనిషి ముఖం మీద చిరు నవ్వే. వాళ్ళతో మాట కలిపాను. నా మాటలు కొన్ని వాళ్ళకి అర్ధం కాలేదు. మోసం, దు:ఖం, చెడు, చంపడం, ఏడ్వడం ఇలాంటి మాటలేవీ ఇక్కడి వాళ్ళకి తెలియదు. సంతోషం, సాయం, నవ్వడం, కలిసి మెలిసి వుండడం మాత్రమే వీళ్ళకి తెలుసు. సాయంత్రం అయినా ఇక్కడ పూలు వాడిపోలేదు. జలపాతాల్లో నీళ్ళు కల్మషం అవ్వడం లేదు. నా ముఖం లో చిరునవ్వు చూసి దేవుడు సంతోష పడ్డాడు. ఇదేమి లోకం అని ఆశ్చర్యం గా అడిగాను. నేను భూమి ని అందులో మనుషుల్ని సృష్టించినప్పుడు ఇలానే చేసాను. భూమి మీద ప్రతి సారి మనిషి కి అవసరం అయినప్పుడు నేను వెళ్లాల్సి వచ్చింది. మనిషి నా మీద పూర్తి గా ఆధార పడకూడదు అని తెలివి తేటలు ఇచ్చాను. పోను పోను మనిషి నన్ను మరచిపోయాడు. నేను రాసిన గీత దాటేసాడు. మోసం నేర్చాడు. ఒకరిని ఒకరు చంపుకుంటున్నారు. పాపాలు చేస్తున్నారు. అందుకే అక్కడ పూలు వాడి పోతున్నాయి. నీరు, గాలి, ఆకాశం అన్నీ కల్మషం, మనిషి మనస్సుల తో సహా. నేను సృష్టించిన మనుషుల మీద ప్రేమ నాకు ఇంకా తగ్గిపోలేదు. అది జరిగిన రోజు భూమి మీద మనిషిని అంతం చేసే బాధ్యత నాదే. అప్పుడు మళ్ళీ పునః సృష్టి చెయ్యడానికి ఇక్కడ మిగిలిన వీళ్ళే ఆధారం. ఈ సారి మనిషి కి తెలివితేటలు ఇవ్వను. నేను నవ్వాను. నా నవ్వు చూసి దేవుడు నవ్వాడు.




“బారెడు ప్రొద్దు అవుతుంటే ఇంకా లేవరేమిటండీ?” అంటూ మా ఆవిడ లేపుతుంటే నాకు తెలివి వచ్చింది. “పిల్లలు కూడా తండ్రిలాగే ఎంత లేపుతున్నా లేవరే..” అంటూ అందర్నీ లేపడం మొదలు పెట్టింది. తను అప్పుడే తలంటు పోసుకున్నట్లు గా ఉంది, జుట్టు తడి ఇంకా ఆరినట్లు లేదు, అటు ఇటు గబాగబా తిరుగుతున్నట్లు ఉంది, మొహం మీద చిరు చెమట్లు పట్టి, చెప్పొద్దూ నాకు ముచ్చటగా అనిపించి, చిలిపిగా “అలివేణి, ఇలా రావోయి” అన్నాను.. “ బాగుంది సంబడం అసలే నేను హైరానా పడుతుతుంటే మీకు చీమ కుట్టినట్లు అయినా లేదు.సరసాలకి ఇది సమయం కాదు” అంటూ వంటగదిలోకి వెళ్లింది,కాఫి తీసుకురావడానికి

“సెలవుకదా అని తీరిగ్గా లేవచ్చనుకుంటే ఏమిటి నాన్నగారు మీ అవిడ గోల” అంటూ పిల్లలు విసుక్కోసాగారు. అప్పుడే పనిమనిషి రావడం, అమ్మగారు ఆలస్యంగా వచ్చినందుకు విసుక్కుంటూ చేయవలసిన పనులు పురమాయించడం జరిగిపోయాయి. అమ్మగారి ఆజ్ఞతో పనిమనిషి ఎవరు చెప్పినా వినకుండా పక్క బట్టలు సర్దేయసాగింది. ఇంకా లాభం లేదనుకుని అందరూ లేచారు.

మర్చిపోయాను ఇంతకు మా ఆవిడ పడుతున్న హైరానికి కారణం-మా ఇంట్లో ఆ రోజు మా కాలనీ అసోసియేషన్ సమావేశం. ఎవరికి నొప్పి కాకుండా పోట్ లక్ ఏర్పాటు చేసుకున్నారు, కావలసిన గ్లాస్లు, కూల్ డ్రింక్స్ తెమ్మని నాకు పురమాయించి, అందరికీ ఏవో పనులు చెప్పి, కాలనీ లో పెద్దవాళ్లు వస్తున్నారంటూ మా ఆవిడ తెగ సంతోష పడిపోవడం మొదలు పెట్టింది. క్రిందటిమాటు మిస్సెస్స్ వనజ గారింట్లో ప్లేట్స్ శుభ్రంగా లేవంటూ బేగం బజార్లో కొత్తగా వచ్చిన ఎండు అరటి ఆకులతో చేసిన ప్లేట్స్ తెమ్మంటే, రెండు రోజులు కష్ట పడి వెతికి మొత్తం మీద తెచ్చాను.

ఇది కాకుండా మొన్న లేడీస్ అసోసియేషన్ వాళ్ళు ఆకాశవాణి హైదరాబాద్ 'వనితావని' అనే కదంబ కార్యక్రమం ఇచ్చారు, అది ఈ రోజు ప్రసారం అవుతుంది. ఎప్పడినుంచో మా ఇంట్లో కలవడానికి నిశ్చయించుకున్నారు, అందరూ సరదాగా కార్యక్రమం వినచ్చు అనుకొని ఈ రోజు సమావేశం మా ఇంట్లో అన్నమాట. కార్యక్రమంలో రెండు పాటలు, చిన్న కథ, మోడరన్ అత్తగారు అనే నాటిక ప్రసారమవుతాయి. మా ఇంటిలోనే పెట్టుకోవడానికి ఇంకొక కారణం-ఇన్వెర్టర్; వేసవి కరెంటు కోతలలో విసిగి పోయి నేను ఇన్వెర్టర్ పెట్టించాను. ఒక వేళ కరెంటు పోయినా అందరూ కలసి ఆ కార్యక్రమాలు వినడానికి వీలుగా ఉంటుందని నిర్ణయించారు.

ఈ కార్యక్రమం బాగా చెయ్యాలి అని మహిళా మణులు అందరూ తెగ కష్ట పడిపోయారు. ఒక ప్రముఖ రచయిత్రితో చిన్న నాటకం రాయించారు. ఇచ్చిన టైంని ఎలా వాడుకోవాలని రెండు మూడు రోజుల సుదీర్ఘ సమావేశాల తరవాత మొత్తం కార్యక్రమం నిర్ణయమైపోయింది.

అన్నీ సెలవు రోజులలో ఉదయం జరిగినట్టే, టిఫిన్ లేదని హోటల్ నుంచి టిఫిన్ కూడా తెమ్మని మా ఆవిడా పురమాయించింది. మా పనిమనిషికి "అన్నీ గూళ్ళు దులుపు! ఎక్కడా దుమ్ము కనిపించకూడదు, అన్నీ గదులు సుబ్బరంగా నీట్ గా ఉంచాలని" ఫర్మానాలు జారీ చేసింది. అందరూ ఎవరికి అప్పచెప్పిన పనులు వారు చెయ్యడానికి తయారయ్యారు. బజారు నుండి కావలసినవన్నీ తెచ్చి స్నానం చేసి నేను రెడీ అయ్యాను. చెప్పడం మర్చిపోయా ఆ రోజు మేమందరం ఏమి డ్రెస్ వేసుకోవాలో కూడా మా ఆవిడ నిర్ణయించేసింది. ఆఖరికి పనిమనిషితో సహా అందరూ వచ్చేలోగా తయారు కావాలని తాఖీదు.

పదకొండు గంటలయ్యేసరికి ఒక్కరొక్కరే రావడం మొదలయ్యింది. మొట్టమొదట చక్రపాణి దంపతులు వచ్చారు. చక్రపాణిగారికి వెస్ట్రన్ మ్యూజిక్ అంటే మహా సరదా. అవతలవాళ్ళు పడే పాటలో ఒక్క ముక్క అర్ధం కాకపోయినా రెచ్చిపోయి కర్ణాటక రాగాల తాళం వేసేస్తూ ఉంటారు. హలో అంటూ అందరిని పలకరించి అయన ప్రపంచంలోకి వెళ్ళిపోయారు. ఒక్కరు తర్వాత ఒక్కరు రావడంతో, చూస్తూ ఉండగానే ఇల్లు అంతా నిండి పోయారు. ప్రతి వాళ్ళు ఏదో ఒకటి తీసుకురావడంతో మా డైనింగ్ టేబుల్ నిండి పోయింది. వాళ్ళు తెచ్చినవన్నీ చిన్న గిన్నెలలోకి సర్దడం మా పిల్లల డ్యూటీ

.

మా ఆవిడా హడావిడి ఇంతా అంతా కాదు, ఇల్లంతా కలియ తిరుగుతు హడావుడి పడిపోతోంది. వచ్చిన వారందరితో పలకరింపులు, కుర్చీలు చూపిస్తూ, మంచి నీళ్ళు కావాలా అంటూ అందరికి మర్యాద బాగా చేసింది. కొత్తగా కాలనీ లోకి వచ్చిన వాళ్ళకి, మా వారు, పిల్లలు అంటూ పరిచయం చేసింది. ఇంకా మా అతిధులు అంటారా, మా ప్రపంచమే వేరు అంటూ రావడం ఆలస్యం, పాలిటిక్స్, స్పోర్ట్స్ మీద డిస్కషన్స్. భారత్ క్రికెట్ వరల్డ్ కప్లో ఎందుకు ఓడిపోయింది ఇలాంటివి. ఒక అయన వాళ్ళ అమ్మాయి క్రితం వారం పంపిన సెల్ ఫోన్ లో పాటలు వినడం మొదలు పెట్టాడు. నాకు తరవాత తెలిసింది అయన పాటలు వినడం కాదు, కొత్తగాచెముడు వచ్చింది, ఎవరికీ అనుమానం రాకుండా ఉండాలని ఇయ్యర్ ఫోన్ వాడుతున్నరుట. ఇంకొక అయన ఫ్లిప్ కార్ట్ లో పుస్తకం ప్రింటింగ్ కి ముందరే ప్రీ ఆర్డర్ చేసి తెచ్చుకున్న నవల వేరే వారి ప్రమేయం లేకుండా చదువు కొనడం మొదలు పెట్టాడు. మరి ఇక్కడ చెప్పడం భావ్యం అవునోకాదో నాకు తెలియదు; మా వీధిలో సుబ్బారావు గారు మాత్రం ఎవరిని నొప్పించకుండా, కాఫీ తగిన తరవాత టైం వేస్ట్ చేయడం ఎందుకు అని అనుకున్నారేమో రామకోటి రాయడం మొదలు పెట్టారు.

అందరూ వచ్చిన తరవాత నేను చెయ్యవలసిన పని ఐపాడ్ లో ఫోటోలు తియ్యడం. మా పెద్దమ్మాయి కెమెరా లో ఫోటోలు తియ్యడం. రెండు రోజుల ముందరే బాటరీలు బాగా ఉన్నాయా లేవా అని చూసుకున్నాము. పలకరింపులు అయిన తర్వాత కూల్ డ్రింక్స్, కాఫీ తాగుతూ ఆ వారం రాజకీయ, సమాజిక, సినిమా కబుర్లు వగైరాలలో అందరూ మునిగిపోయారు . సరే ఎవరి అభిప్రాయాలూ వారివి విశ్లేషణ వేడి గాను వాడి గాను జరిగి పోతున్నాయి.

ఇంతలో జానకిరామయ్య గారు అని అయన కాలనీలో కాస్త సుశాస్త్రియంగా పాడుతూ ఉంటారు. సామూహికంగా కాలనీ లో జరుపుకునే పండగలకి పబ్బాలకి అయనే మాకు దిక్కు. ఒక విధంగా చెప్పాలంటే మా కాలనీ నిలయవిద్వాంసుడు. వచ్చిన చిక్కు ఎక్కడంటే ఒక మారు పాట అందుకుంటే వాటికీ తోడూ రెండు మూడు పాటలు పాడనిదే అయన అస్త్రసన్యాసం చెయ్యరు. ఆ రోజు గట్టిగా టిఫిన్ లాగించారేమో మొదలు పెట్టడమే అన్నమయ్య కీర్తన అందుకున్నారు. పైకి అందరూ నవ్వుతూ ఉన్నా లోలోపల "ఈయనికి ఒక సమయం పాడు ఉండదు ఎప్పుడు పడితే అప్పుడే రాగాలు అందుకుంటాడని" విసుక్కున్నారు.

సోఫాలో కూర్చొన్న హైమావతిగారు వాళ్ళ మనవరాలి పెళ్ళికి వియ్యాలవారి తో కలసి చెన్నైకి వెళ్ళి పోతీస్ లో కొన్న చీరల గురించి, రంగుల గురించి, ధరల గురించి, అక్కడికి ఇక్కడికి ధరలలో ఎంత వత్యాసాలు ఉన్నాయో చెబుతూ ఉంటే, ప్రక్కనే కూర్చొన్న సుబ్బలక్ష్మి గారికి మండి పోతోంది ఏమి చెయ్యాలో తోచలేదు. ఆవిడా కూడా వాళ్లింట్లో మనమరాలి పెళ్ళికి ఇలాంటి ప్రపోసల్ పెడితే కొడుకు, కోడలు ససేమిరా వద్దు అంటూ వినుపించుకోలేదు. అది ఆవిడ కోపం."నాన్న నాన్న అటు చూడు" అంటూ మా అమ్మాయి విశాలాక్షి గారిని చూపిస్తుంటే నేను అటు చూసాను. ఆవిడ భర్త ఒక చిన్న పాటి లీడర్. నగరం చుట్టూ

పక్కల ఉన్న పరిశ్రమల వర్కర్ల యూనియన్లకి లీడర్. ఆవిడ కొత్తగా గాజులు చేయించుకున్నరానుకుంటాను, మాటిమాటికి చెంపల మీద జుట్టుని సవరిస్తున్నారు. ఎవరైనా చూడక పోతారా..అనుకుంటూ కాని ఎవరి మట్టుకు వాళ్ళు చాలా బిజీగా ఉన్నారు, ఆవిడా కాస్త చిన్నబుచ్చుకున్నారు.

మధ్యాహ్నం 12.00 గంటలకి అందరూ తెచ్చుకున్నవి తినడానికి ఉద్యుక్తులయ్యారు. మర్చిపోయాను షుగర్ పేషెంట్లకి ప్రత్యేకంగా ఏర్పాట్లు జరిగాయి. తెచ్చుకున్న వంటకాలలో బాగున్న వాటిని మెచ్చుకుంటూ, బావులేనివి ఎందుకు బాగోలేవో అనుకుంటూ మొత్తం మీద తిండి కార్యక్రమం సజావుగా జరిపించేసేరు . జానకిరామయ్య గారు " కార్యక్రమం ప్రారంభం కావడానికి ఇంకా సమయం ఉంది. బాలమురళికృష్ణ గారి తత్వాలు వింటారా?" అనడమేమిటి, అందరూ మొగవాళ్ళు దమ్ము లాగడానికి, పాన్ వేస్తుకోవడానికి పారిపోయారు. కొంతమంది ఆడవాళ్లు పని ఉన్నట్లు వంటింటిలోకి, గదుల్లోకి వెళ్ళిపోయారు. చేసేదేమీ లేక అయన కూని రాగాలు తీయడం మొదలు పెట్టారు. మధ్యాహ్నం 1.30 కి వచ్చే కార్యక్రమం వినడానికి అందరూ తయారయ్యారు. సరే రావలసిన సమయం రానే వచ్చింది. కార్యక్రమంలో ఒక పాట అయిన తరవాత 'మోడరన్ అత్తగారు ' నాటకం పాత్రధారులు వగైరా అనౌన్స్ చేశారు . 'ఫట్' మని కరెంటు పోయింది . గ్రౌండ్ ఫ్లోర్ ఏమో , ఇల్లంతా చీకటి. నాకు అర్ధం కాలేదు ఇన్వర్టర్ ఉండగా కరెంటు పోవడం జరగదు కదా.

అయ్యో ఎవరి ఇంట్లో వాళ్ళు ఉన్నా బాగుండు కదా కార్యక్రమం వినేవాళ్ళం, ఇప్పుడు ఏమిటి చేయడం అంటూ అసహనం అందరూ వినేలాగే వ్యక్తం చేశారు. నాకు మా ఆవిడా వైపు చూడడానికి ధైర్యం చాలలేదు. తనకి కూడా ఏమి జరిగిందో అని అర్ధం కాలేదు. నిన్నటివరకు బాగా పని చేసిన ఇన్వర్టర్ ఈ రోజే పని చెయ్యకుండా ఉండలా అంటూ తిట్టుకుంది. తన కోసం ప్రత్యేకంగా తెచుకున్న తెప్పించుకున్న ట్రాన్సిస్టర్లో బ్యాటరీలు ఉన్నాయో లేదో చూసుకొని ఉండవలసినదని తెగ బాధ పడిపోయింది. ఊ....వచ్చిన పని అయ్యింది కదా..... ఇంకా బయలుదేరుదామా" అంటూ అందరూ వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. వెళ్లి వస్తాము అంటూ అందరూ నిస్పృహగా వెళ్లారు. అందర్నీ పంపించి మా ఆవిడా సోఫా లో అలసిపోయి కూలపడి ..ఎంతో ప్లాన్ చేసి ప్రోగ్రామం పెడితే ఇలా జరిగిందేమిటి అని చాలా బాధ పడి పోయింది. పోయిన కరెంటు మళ్ళీ వచ్చింది..అసలు ఇన్వర్టర్ ఎందుకు ఆగిపోయిందని చూతును కదా......నాకు నోట్లోనుండి మాట రాలేదు. జరిగింది ఏమిటంటే ప్రొద్దునే దుమ్ము దులపమన్న మా పనిమనిషి ఆ పని చేస్తూ ఇన్వర్టర్ స్విచ్ పొరపాటున ఆర్పేసింది. దాంతో మధ్యాహ్నం వరకు బ్యాటరీ అయిపోవడం ...కావలసిన టైంకి కరెంటు లేకపోవడం ..దీని కారణం ఇది అని మా భార్యామణికి చెప్పడానికి నాకు ధైర్యం చాలక .....మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయాను..... ఇన్వర్టర్ మొత్తం మీద కార్యక్రమం అంతా ఇన్వర్ట్ చేసిందే అనుకుంటూ!




పూర్వం రామాపురం, కృష్ణాపురం అనే ఊళ్ళు పక్క పక్కనే ఉండేవి. ఐతే వాటి మధ్యలో అడ్డంగా ఒక పెద్ద కొండ ఉండటంతో రెండు గ్రామాల వారు రాక పోక లకి కొండ చుట్టూ తిరిగి వెళ్ళేవారు. దీనివల్ల రెండు గ్రామాల మధ్య దూరం చాలా ఎక్కువ అవటంతో ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఆ కొండని తొలిచి దారిని ఏర్పాటు చేస్తే తమ సమస్యలు తీరు తాయి అని ఐతే ఆ పని ఎవరైనా చేస్తే బాగుంటుంది అని అనుకొని ఊరుకునేవారే తప్ప ఎవ్వరూ ఆ దిశగా ప్రయత్నం చెయ్య లేదు. అంత పెద్ద కొండని తవ్వి దారి ఏర్పాటు చేయటం అసాధ్యం అని గ్రామస్తులంతా భావించేవారు.

రామాపురం తో పోల్చుకుంటే కృష్ణాపురం చాలా అభివృద్ధి చెందింది. కృష్ణాపురం లో విద్యాలయాలు, వైద్యశాలలు, అంగళ్ళు వంటివి ఉండడం వలన రామాపురం ప్రజలు చుట్టూ తిరిగి కృష్ణాపురం వెళ్లి పనులు చూసుకునేవారు. ఏ అవసరానికి అయినా వాళ్ళకు కృష్ణాపురం వెళ్ళక తప్పేది కాదు.

రామాపురం లో రామయ్య అనే ఒక బీద రైతు ఉండేవాడు. తనకున్న కొద్ది పాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ తన భార్య తో సంతోషం గా ఉండేవాడు. రామయ్యకి సంతానం లేదు. ఒక రోజు రామయ్య భార్య కి తీవ్రమైన అనారోగ్యం చేసింది. రామాపురం లో సరైన వైద్య సదుపాయాలు లేనందున కృష్ణాపురం తీసుకు వెళ్ళ వలసి వచ్చింది. ఎడ్లబండి లో

రామయ్య తన భార్యని పడుకోబెట్టి ప్రయాణం మొదలు పెట్టాడు. చుట్టూ తిరిగి కృష్ణాపురం చేరే సరికి రామయ్య భార్య మరణించింది. దాంతో రామయ్య ఎంతో కలత చెందాడు. తమ గ్రామానికి కృష్ణా పురానికి మధ్య ఉన్న కొండ మధ్య నుంచి దారి ఏర్పాటు అయి ఉంటే తన భార్య సకాలంలో వైద్యం అంది బ్రతికేది అని రామయ్య కి అనిపించింది. తన భార్య లాగ ఇంకెవరికీ ఇలా జరుగ కూడదని నిర్ణయించుకున్నాడు. అంతే మరు సటి రోజునుంచి రామయ్య ఒక పెద్ద సుత్తి, ఉలి తీసుకొని కొండ దగ్గరికి వెళ్లి కొండ ని తొలిచి తమ గ్రామానికి పక్క గ్రామమైన కృష్ణా పురానికి మధ్య దారి ఏర్పాటు చేయటం మొదలు పెట్టాడు. కొండని తొలిచి దారి ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్న రామయ్యని గ్రామస్తులు పిచ్చి వాడి కింద జమకట్టి ఒక్కరూ సాయానికి రాలేదు. అయినా రామయ్య పట్టించుకోకుండా తన పని తాను చేస్తూనే ఉన్నాడు. అలా కొంత కాలం గడిచింది.అనుకోకుండా ఆ ప్రాంతపు జమీందారు ఒక రోజు మారు వేషం లో రామాపురానికి వచ్చాడు. ఆయనకి ఆ గ్రామస్తుల ద్వారా రామయ్య ప్రయత్నం గురించి తెలిసింది. జమీందార్ రామయ్య తొలుస్తున్న కొండ దగ్గరికి వెళ్లి రామయ్య ని పలకరించాడు. రామయ్యని " నీవు ఒక్కడివే ఇంత పెద్ద కొండ తొలిచి మార్గం ఏర్పాటు చేయ గలవా ? మీ వూరు వారంతా నిన్ను వెర్రి వాడి కింద జమ కట్టుతున్నారు కదా!" అని ప్రశ్నించాడు. జమీందారుని గుర్తించని రామయ్య " అయ్యా తమరు ఎవరో నేను ఎరుగను. నా జీవితం ముగిసే లోగా దారిని తప్పక ఏర్పాటు చేస్తానని నాకు నమ్మకం ఉన్నది. నా భార్య లాగా మరి ఎవ్వరూ మరణించ కూడదు అనే నా ఈ చిన్ని ప్రయత్నం" అని సమాధానము ఇచ్చాడు. జమీందారు రామయ్య సమాధానికి ఎంతో సంతోషించాడు. చీకటిని తిడుతూ కూర్చోవటం కన్నా చిరు దీపం వెలిగించాలి అనే విధంగా రామయ్య చేస్తున్న ప్రయత్నం జమీందారుకి ఎంతగానో నచ్చింది. ఇటువంటి వాడు ఊరికి ఒక్కడు ఉన్నా చాలు ప్రజల సమస్యలు చాలా వరకు తీరిపోతాయి అని జమీందారు కు అనిపించింది.

తరువాత కొన్ని రోజులకి జమీందారు పంపించిన కూలీలు, నిర్మాణ సామగ్రి రామాపురానికి చేరుకున్నాయి. రామయ్య కొండ తొలచి ఏర్పాటు చేసిన దారిని జమీందారు పంపించిన కూలీలంతా కలసి మరింత విశాలంగా తీర్చి దిద్దారు. చూస్తుండగానే కొండ కరిగి పోయింది. అసాధ్యం అనుకున్న దారి సుసాధ్యం అయ్యింది. కృష్ణాపురానికి రామా పురానికి మధ్య చక్కని దారి ఏర్పడింది. రామాపురం ప్రజల కష్టాలు తీరాయి. ఇప్పుడు రామాపురం ప్రజలకు రామయ్య అంటే కార్యసాధకుడు, మార్గదర్శి. జమీందారు ఆ కొండ దారి పూర్తి అయ్యాక స్వయంగా ఆ వూరు వచ్చి రామయ్య ని సత్కరించాడు.

(Mountain Man గా పేరు తెచ్చుకున్న దశరథ్ మాంజ నిజ జీవిత కథ స్ఫూర్తి తో - రచయిత. )




సరస్వతి , జగదంబ చిన్ననాటి సహాధ్యాయులు . పెళ్ళయ్యాక కూడా వాళ్ళ అత్తవారిళ్ళు... ఒకరికొకరు బంధువుల కావటం వల్ల వాళ్ళ 'స్నేహం' సాగుతూనే ఉంది .

పక్కఊరిలో పెళ్ళికి వచ్చారు సరస్వతి కుటుంబం ! అందర్నీ పంపేసి తను మాత్రం జగదంబ దగ్గర నాలుగు రోజులు గడుపుదామని ఆగింది సరస్వతి . అదే పెళ్ళికి జగదంబ , భర్త వెళ్ళటం - సరస్వతిని తనతో వచ్చి, ఉండమని బతిమాలటం కుడా కొంతకారణం!

" నువ్వు ఆ పెళ్ళికి రాకపోయినా నేనొచ్చి నీ దగ్గర నాలుగు రోజులుండి వెళ్ళేదాన్నే! మొదటినించి నేననుకుంటున్నదేనే ఈ పెళ్ళికి వెళ్ళటం జరిగితే నీతో గడిపి వెళ్లాలని ! " నవ్వుతూ అంది సరస్వతి .

అలా -అలా మాట్లాడుకుంటూ 'పూజ గది' లోకి వెళ్ళారిద్దరూ! జగదంబ మనుమడు ఐదేళ్ళ వాడు బామ్మతో

కలిసి పూజ చెయ్యాలని కాచుక్కూచున్నాడు . వాడి శ్రద్ధ చూసి , చాలా ముచ్చట పడింది సరస్వతి .

" ఇంకా ముద్దమాటలు తగ్గలేదని ఊరుకున్నాను గాని...లేకపోతే ఈపాటికి అంగపూజా - అష్టోత్తరం నేర్పెద్దును .. " అంది మనుమడి తలనిమురుతూ జగదంబ .

" అయ్యో నీ అసాధ్యంకూలా...ఏమిటంత అర్జంటు?" ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి .

"చిన్ననాటినించే పిల్లలకన్నీ నేర్పాలి సరసూ! లేకపోతె పెద్దైన తర్వాత నలుగురిలో 'అభాసు' పాలౌతాం దీక్షితులుగారి మనుమడిలా!" పాక పకా నవ్వుతూ అంది జగదంబ

******** ********** ********** **********
**********

హడావిడి పనులు పూర్తయ్యాక సావధానంగా కూచున్నారిద్దరూను .

" ఇప్పుడు చెప్పు ఏదో చెప్తానన్నావుగదా ! దీక్షితులుగారి మనుమడు... " అందించింది సరస్వతి .

" ఓహ్...అదా... ?" అంది జగదంబ కిల కిల నవ్వుతూ.

" అబ్బ... ఊరించి చంపకే.... చెప్పు... " అన్న సరస్వతితో ---------------

" నాలుగిళ్ళ అవతల ఎవరో కొత్త జంట అద్దెకొచ్చారు ! చుట్టుపక్కల మా నలుగుర్నీ తాంబూలానికి పిలిస్తే వెళ్లాను. పూజకేమీ సిద్ధం చేసుకోలేదు వాళ్ళు ! వెళ్ళిన నలుగురం అన్నీ అమర్చసాగాం... హరివాణం, ఉద్ధరిణి ఉన్నాయి...కాని-పంచపాత్ర లేదు.... అనగానే దీక్షితులుగారి భార్య - తెమ్మని వారి మనుమణ్ణి పంపింది . ఆ కుఱ్ఱాడు తెచ్చినవి చూశాక - అక్కడ చాలామందికి నవ్వాగలేదు ! "

పది లీటర్లు ...పట్టే ఒక పెద్ద స్టీలుగిన్నె , అరచేతి వెడల్పున్న 'జరీ అంచు పంచ' తెచ్చాడు . నవ్వుతున్నవాళ్ళను చూస్తూ తనేదో 'తప్పు' చేసినట్లు ఫీలయ్యాడాకుఱ్ఱాడు - " ఓహో...పంచ -అంటే ఐదు కదా? ఔనౌను ... ఇంకా నాలుగు పాత్రలు తేవాలన్నమాట... సోరీ... తెచ్చేస్తానుండండి" అంటూ మళ్లీ పరుగెత్తబోయాడు .

" వాళ్ళెక్కడో 'ఢిల్లీ ' లో ఉంటారు . వాళ్లకి 'పూజా - పునస్కారాలు' తక్కువ . నేనెళ్ళి తెస్తానుండండి !" అంటూ దీక్షితులు గారిభార్యే బయలుదేరి వెళ్ళింది . "యజ్ఞాలూ -యాగాలూ చేయించే ' ఆహితాగ్ని' దీక్షితులు గారి మనుమడికి 'పంచపాత్ర'అంటే... తెలియదా??? "అక్కడందరూ అదే మాట..." ఏం చేస్తాం- చెప్పండి ఇప్పటి సంసారాల్లో ఎవరిష్టం వారిది కదా? పెద్దవారే అనుసరిచకపోతే... ఇంక పిల్లలకెలా తెలుస్తాయ్?" నవ్వుతూనే అన్నా - దీక్షితులుగారి భార్యకిది కొంచెం అవమానంగానే అనిపించి ఉంటుంది పాపం ! ఎందుకంటే అస్తమానం అందర్నీ 'తప్పు'పడుతూనే ఉంటుందావిడ"

" నువ్వు చెప్పింది నిజమే జగదంబా! చిన్ననాటి నుంచి మన సంప్రదాయాలు పిల్లలికి నేర్పించాలి. మంచి - చెడు వివరించి చెప్పాలి . సాధ్యమైనంతవరకూ వాళ్ళని 'సుపథం' వైపు మళ్ళించాలి! చక్కని వ్యక్తిత్వంతోబాటు మన వేదధర్మాలను, మన సంస్కృతిని కూడా అర్ధమయ్యేలా బోధించాలి! " మనస్ఫూర్తిగా అంది సరస్వతి .

"ఇంకో వింత చెప్పమన్నావా సరసూ...! నేనిందాకా చెప్పిన కుఱ్ఱాడే 'డిగ్రీ' పూర్తయాక తాతగారి దగ్గరకి వచ్చేశాడు . వేదాలూ -శాస్త్రాలు , ఉపనిషత్తులూ- పురాణాలూ ,మీమాంసలూ... ఒకటేమిటి అన్నీ పుక్కిట పట్టేశాడు! పండితుడైపోయాడు... పామరజన్నాన్ని చేర్చి విద్యావంతుల్ని చేస్తున్నాడు . అన్ని విధాలా 'ఉద్దండుడు' అనిపించుకున్నాడు తెలుసా ? ఒక్కోసారి ఆనాటి 'పంచపాత్ర' సంగతి చెప్పి... 'నిజంగా ఆనాడు

ఆ సంఘటన జరగకపోయి ఉంటే - దాన్ని నేను సీరియస్ గా తీసుకోకపోయి ఉంటే , ఈ 'సంపన్నిధి' ని నేను తెలియకుండానే - కోల్పోయి ఉండేవాణ్ణి!" అని ఉదహరిస్తూ... విద్యార్ధులను ప్రోత్సహిస్తుంటాడు .

" నీ దగ్గిరకి వచ్చినందుకు ఒక చక్కని విషయం గ్రహించాను జగదంబా! నేనుకూడా మా మనుమరాలికి స్తోత్రాలూ - స్తవాలూ నేర్పటం మొదలెడతాను" అంది సరస్వతి!

" వాళ్ళు చదువుతుంటే నేర్పిన మనకెంత తృప్తిగా ఉంటుందో గమనించు" మెరుస్తున్న కళ్ళతో అంది జగదంబ . స్తోత్రాలు నేర్చుకునే పిల్లలు గుంపుగా రావటంతో లేచి వెళ్ళింది జగదంబ .

" తను కూడా 'ఇలా' కాలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు" అనే నిర్ణయానికి వచ్చింది సరస్వతి .




"అమ్మడూ, "లైక్' అంటే 'ఇష్టం' అనే కదా అర్ధం?" అంటూ మా నానమ్మ ఓ ప్రశ్న సంధించింది భోజనాల దగ్గర.

"ఎందుకమ్మా ఇంటర్ వరకూ చదువుకున్న నీకు అంత పెద్ద డౌటొచ్చింది?" అన్నారు మా నాన్న.

" ఏం లేదురా వాడుకను బట్టి ఒక్కోసారి భాష లోని పదాల అర్ధాలు మారుతూ ఉంటాయని చదివాను. అలా ఈ 'లైక్" కి కూడ అర్ధం మారిందేమోనని.." అని మా నానమ్మ చెపుతూండ గా...

“వాట్’! వర్డ్స్ మీనింగ్స్ చేంజ్ అవుతాయా? అదెలా/ ఎప్పుడేనా అలా జరిగిందా నాన్నమ్మా? ఎగ్జాంపుల్ ప్లీజ్?” మా తమ్ముడు ప్రశ్న మీద ప్రశ్న వేసేసాడు.

“అవును నానా! వెనకటి కాలంలో తెలుగులో “కంపు” అంటే ‘సుగంధం’ అనే అర్ధం ఉండేదంట.” ‘Nervous’ అనే ఇంగ్లీష్ పదానికి ‘ బాగా బలవంతుడు’ అనె అర్ధం ఉండేదిట.

“Oh my God!’ నేను ఎగ్జామ్ లో ఆన్సర్ రాసేసిన తరువాత ఇలా అర్ధం మారిపోతే నాకు మార్క్స్ ఇస్తుందా మా టీచర్? మాకెలా తెలుస్తుంది ఇలా meanings మారిపోయయని?” అంటూ నాల్గవ తరగతి చదివే మా తమ్ముడు గగ్గోలు పెట్టాడు.

“ ఒరేయి, ఆపరా నీ గోల అలా ఏం జరగదులే,” అంటూ మా తమ్ముని గదమాయించి, ఇంతకీ ఈ ‘లైక్’ కి అర్ధం మారిందని ఎందుకనుకున్నారు అత్తయ్యా?” అంటూ మా అమ్మ ప్రశ్నించింది.

మా నానమ్మ ఏదో చెప్పేలోగా మా తమ్ముడు, “నాన్నమ్మా, I am very nervous,” అంటూ వాడి చెయ్యి మోచేతి వరకు ఎత్తి, కండరాలు బిగించి చూపించసాగాడు. అదేంట్రా అన్నాము అందరమూ ఒకేసారి. “అదే nervous అనే పదానికి అర్ధం ఇప్పటి strong గా ఉండి ఉంటే ఇలాగే కదా అనాలి అని.” అందరమూ ఘొల్లుమని నవ్వాము.

“వాడి ఆటలకేం గానీ మీరు చెప్పండత్తయ్యా,” అంది అమ్మ

“ఆ ముఖ పుస్తకంలో, అదేమ్మా ఫేస్ బుక్ లో ఒకమ్మాయిపై యాసిడ్ పోసారని, ఆ అమ్మాయి పరిస్థితి దారుణంగా ఉందనీ, కుటుంబ సభ్యులు దయనీయంగ ఏడుస్తున్నారనీ ఎవరో పోస్ట్ పెట్టారు. దానికి ౨౦౦ పైగా లైకులు. మన రాజారావు లేడూ అంటూ మా నాన్న వేపు తిరిగింది. “అవునూ, మొన్న హార్ట్ సర్జరీ అయింది కదా” అన్నారు నాన్న. ఆ ఆయనే, నేను హాస్పిటల్లో ఉన్నాను, ఇలా జరిగిందీ అని పెట్టారు. దానికి ఒక యాభై రెండు మంది లైకు పెట్టారురా. మరో దగ్గర ఒక ముసలి వాళ్ల ఆశ్రమంలో వారికి సరి అయిన వసతులు లేవనీ, ఆ కార్యకర్తలు డబ్బు తీసుకుని కూడా వాళ్ళని సరిగా చూడడం లేదని పెడితే దానికో వెయ్యి పైగ లైకులు. ఇలాంటి వాటిని ఇష్టపడటం ఏమిటి. జనాలు అంత సాడిస్టులవుతున్నరా, లేక ఈ ‘లైక్’ అనే పదానికి అర్ధం వేరేనా అని అనిపించి అడుగుతున్నాను,” అంది నాన్నమ్మ.

“అదా విషయం,” అని నవ్వేసారు అమ్మ, నాన్న.

(ఏమీ తోచట్లేదు అంటుందని ఈ మధ్యే మా నానమ్మకి ఫేస్ బుక్ ఐడి క్రియేట్ చేసి అది వాడటం నేర్పించాను.)

"ఓహ్, ఫేస్ బుక్ లైకులా! ఆ లైకులకు, అంటే ఫేస్ బుక్ కి సంబంధించిన వరకు చాలా అర్ధాలు ఉన్నాయి నాన్నమ్మా," అంటూ మొదలుపెట్టాను నేను. ఈరోజుల్లో అందరూ ఈ ఫేస్ బుక్ వాడుతున్నారు. కానీ అందరూ చాలా బిజీ, బిజీ. తమ పోస్టులు పెడతారు, కొన్ని పోస్టులకు స్పందిస్తారు కూడా.     కానీ , అందరివీ     చూసి అన్నిటికీ స్పందించాలంటే చాలా కష్టం. అలాటి వారికి ఈ లైక్ బటన్ ఒక వరం.

ఎవరైనా పెట్టిన పోస్ట్లకు దాన్ని చూసిన వారు లైకులు పెడుతూ ఉంటారు. అలా పెట్టిన్ కొన్ని లైకులకు అ పోస్ట్ మేము చూసాము అని అర్ధం అయితే, మరికొన్ని లైకులకు 'మీ పోస్ట్ బాగుంది అని అర్ధం. ఏవేనా మంచి విషయాన్ని తెలియచేసేదైతే మంచి విషయాన్ని తెలియ చేసినందుకు ధన్యవాదాలు అని అర్ధం. ఒక విమర్శనాత్మక రచనకు లైకులు పెడితే మీ అభిప్రాయంతో మేమూ ఏకీభవిస్తున్నాము అని, ఒక విచారకరమైన వార్తకైతే ఇది మాకూ చాలా విచారకరం అనీ, ఒక అభినందనీయ విషయమైతే మిమ్మల్ని మేము అభినందిస్తున్నామని అర్ధం. అదే ఇందాక నువ్వు చెప్పినట్టు యాసిడ్ వార్తో లేదా ఆశ్రమం వార్తో ఐతే దీన్ని మేము దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక అర్ధమైతే, ఇలాటి వార్తలు అందరికీ తెలిసేలా చేసినందుకు మీకు దన్యవాదాలనీ అర్ధమూ రావచ్చు. ఇదిగో ఈ రాజారావు అంకుల్ లాంటి విషయమైతే, అయ్యో విషయం తెలిసింది త్వరలో మిమ్ముల కలుస్తాము అనీ అవ్వచ్చు, లేదా మీరు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని ప్రార్ధిస్తున్నామనీ అవ్వొచ్చు. అదే ఒక మరణ వార్త ఐతే వారి ఆత్మకు శాంతి కలుగు గాక అని కూడ అర్ధం చేసుకోవచ్చు."

"అమ్మో ఇన్ని అర్ధాలే! మరి,     కొన్ని సార్లు మనం పెట్టిన కామెంట్లను కూడా లైకుతారు కదా కొందరు?" అంది నానమ్మ ప్రశ్నార్ధకంగా. అదీ అలాగే. మీ కామెంటు మేము చుసామనీ కావచ్చు, మీతో మేము ఏకీభవిస్తున్నామని కావచ్చు, మీరు బహు బాగా చెప్పారనీ కావచ్చు. అవి అభినందనలు లేదూ శుభాకాంక్షలు లాటివైతే, మీకు మా ధన్యవాదాలు అనీ, ఎవరి దన్యవాదాలకైన లైకు పెడితే, మీ దన్యవాదాలు మేము స్వీకరించమని, అదే ' యు ఆర్ వెల్కమ్' అనీ అని అర్ధం చేసుకోవచ్చు.

ఓహ్ అలాగా! లైకుకి అర్ధం మారలేదు కాని అది చాలా అర్ధాలను సంతరించుకుందన్నమాట. జయహో లైకు బటన్! అంది మా నానమ్మ.

'ఉయ్' అంటూ అందరమూ చెయ్యెత్తాము ఇంగ్లీష్ వింగ్లీష్ లో శ్రీదేవి లాగా.




కృష్ణరాయపురం అనే గ్రామలో ఒక ముసలమ్మ వుండేది. నా అనే వాళ్ళెవరూ లేని ఆమె ప్రతిరోజూ ఒక గంపనిండా గారెలు చేసుకొని కొండమీద వుండే గుడికి వెళ్లి అమ్ముకునేది. ఆమె గారెలు తీసుకుని మెల్లగా నడుస్తూ గుడి వైపు వెళ్తూ వుంటే దారిలో వాడుకగా ప్రతిరోజూ ఆమె గారెల కోసం జనం ఎదురు చూసేవారు.

అలాగే కొండమీద కూడా ముసలమ్మ అభిమానులు చాలామందే వుంటారు. అక్కడ కూడా ముసలమ్మ గారెల కోసం పిల్లలు పెద్దలు ఎదురు చూసేవాళ్లు. మెట్ల దారిలో కూడా ఆమెకు ఎదురు పడిన వాళ్ళే కాక, ఇతర చిల్లర వ్యాపారం చేసుకునే వాళ్ళంతా వర్తనగా ముసలమ్మ గారెలు కొంటుంటారు.

ఒకరోజు కొండమీద దేవుడి దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న ఒక ధనవంతుడు ముసలమ్మను చూశాడు. ఆ వయసులో గారెలగంప చంకలో పెట్టుకుని ఆయాస పడుతూ మెట్లు ఎక్కుతున్న ఆవిడను చూడగానే ధనవంతుడికి విపరీతమైన జాలి కలిగింది. కిందికి దిగుతున్న ఆయన ఆగి ముసలమ్మ వైపు వచ్చాడు. అతడిని చూసిన ముసలమ్మ గారెలు కొంటాడేమో అని గంప మెట్ల గోడమీద పెట్టి, ఆగింది.

ధనవంతుడు ఒక గారె చేతిలోకి తీసుకొని, "అవ్వా ఈ గంపలోని గారెలన్నీ నేను కొంటాను ఎంతో చెప్పు?" అన్నాడు.

ముసలమ్మ ఆశ్చర్యంగా ధనవంతుడి వంక చూసింది. ఆయన ముఖంలో తనపట్ల జాలి కనబడింది. "ఎందుకు?" అని అడిగింది. ఆ ధనవంతుడికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. తాను మొత్తం అమ్మమనగానే ఆ ముసలిది సంతోషించి తన పట్ల కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ గారెలు మొత్తం అప్పగిస్తుంది అనుకున్నాడు కానీ, ఈ ప్రశ్నను ఊహించలేదు. ధనవంతుడికి కొద్దిగా కోపం కూడా వచ్చింది. "ఎందుకైతే నీ కెందుకు? నేనే తింటాను. ఇంటికి తీసుకెళ్తాను. ఇక్కడున్న వాళ్ళకు ఉచితంగా పంచుతాను. లేదంటే అదిగో ఆ కనపడే గోడ వెనుక గిరాటేస్తాను. మొత్తం గారెలు గంపగుత్త ఏంతో చెప్పు!" అన్నాడు.

ధనవంతుడు అలా కోపంగా మాట్లాడినా ముసలమ్మ శాంతంగా "నేను మొత్తం అమ్మను. కావాలంటే ఒకటో రెండో ఇస్తాను కొనుక్కో" అన్నది.ధనవంతుడు ఎన్ని రకాలుగా అడిగి చూసినా ముసలమ్మ వినలేదు. చివరికి విసిగిపోయిన ధనవంతుడు "ముసలిదానా! అనాధలకు సేవ చేయడం నాకు అలవాటు. నీకు మంచి చేద్దామనుకుంటున్నాను. ఈ గారెల గంప ఎత్తుకుని ఆపసోపాలు పడుతూ మెట్లు ఎక్కుతూంటే చూడలేక జాలిపడి మొత్తం కొంటానంటున్నాను... వినిపించుకోవే!" అన్నాడు మరింత కోపంగా.

ముసలమ్మ అంతకు రెట్టించిన శాంతంతో "నా మీద జాలి చూపించడం నాకు నచ్చదు నాయనా!" అన్నది.

ధనవంతుని కోపం నషాలానికంటింది. అతని భార్యా, సేవకులూ వారిస్తున్నా వినకుండా "ఏం చూసుకుని నీకీ పొగరు. నీవు మామూలుగా ఏం ధరకు అమ్ముకుంటావో చెప్పు... దానికి పది రెట్లు ఎక్కువిస్తాను" అన్నాడు.

ముసలమ్మ చాలా ప్రశాంతంగా వద్దన్నది. ధనవంతుడికి అక్కడ నలుగురిలో తన తల తీసేసి నట్లయింది. తన మర్యాద నిలబడే మార్గం ఏమిటో అర్థం కాలేదు. ఏం చేసినా ముసలిది అమ్మేటట్టు లేదు. ధనవంతుడు ఎదురుగా వున్న మెట్ల గోడమీద కూర్చొని ఆలోచించ సాగాడు. ముసలమ్మ తన దగ్గరికి వచ్చిన వాళ్లకు డబ్బులు తీసుకుని గారెలు అమ్ముతూనే వుంది. కొద్దిసేపు చూడగానే ఒక గారెధర ఏంతో అర్థమైంది. చివరిసారిగా ప్రయత్నిద్దామని చెప్పి ధనవంతుడు ముసలమ్మ దగ్గరికి వెళ్లి డబ్బులు లెక్కపెట్టి తీసి ఇస్తూ "వాటి మామూలు ధరకన్నా వంద రెట్లు ఎక్కువిస్తున్నాను ఇందా తీసుకో!" అన్నాడు. అతని గొంతులో ఇందాకటి దర్పం లేదు. ముసలమ్మ వద్దన్నది. ధనవంతుడు తిరిగి వచ్చి మళ్ళీ మెట్లగోడ మీద కూర్చున్నాడు. ఆమె మామూలుగా లేచి గంప తీసుకుని మెట్లు ఎక్కుతూ పైకి వెళ్లి పోయింది.

దాదాపు కొండ మొత్తం ఎక్కిన తర్వాత గుడి కాస్త దూరంలో ఉందనగా ఆ ధనవంతుడు మెట్లు ఎక్కి తనవైపు రావడం ముసలమ్మ గమనించింది. వెంటనే గంప దింపి మళ్ళీ మెట్లగోడ మీద కూర్చుంది. ధనవంతుడు వచ్చి ఆమె పక్కన కూర్చున్నాడు.

డబ్బులు ఇచ్చి ఒక గారె కొనుక్కుని తిన్నాడు. చాలా రుచిగా వుంది. ఆ మాటే ఆమెతో అన్నాడు. ముసలమ్మ సంతోషించింది.

మరో రెండు గారెలు కొని తిన్నాక, ధనవంతుడు తన కుతూహలం ఆపుకోలేక "అమ్మా! నిజం చెప్పండి. నేను గారెలు మొత్తం కొంటానంటే ఎందుకు ఒప్పుకోవడం లేదు?" అని ప్రశాంతంగా అడిగాడు.

ముసలమ్మకు అతని వాలకం చూడగానే జాలి కలిగింది. "అయ్యా! మీరు నామీద జాలిపడి గారెలు మొత్తం కొంటా అంటున్నారని మిమ్మల్ని చూడగానే అర్థమైంది. నేను మీకు మొత్తం గారెలు అమ్మక పోవడానికి నా కారణాలు నాకున్నాయి." అన్నది.

"ఏమిటవి?" తెలుసుకోవాలని ధనవంతుడికి చాలా ఆత్రుతగా వుంది.

"అయ్యా! మొత్తం గారెలు మీకు అమ్మి తిరిగి ఇంటికి పోయి నేను ఏం చేయాలి? అదీగాక ప్రతీరోజు నా గారెల కోసం ఎదురు చూసే వాళ్ళు కొందరున్నారు. నేను రాకపోయే సరికి వాళ్ళంతా నిరాశ పడరా?"

"నీవు చెప్పేది చాలా వింతగా వుందే! ఈ రోజు నీకు చాతనవుతుంది వస్తావు. రేపు నీకు ఏదైనా జరిగి మంచంలో పడ్డావనుకో ... అప్పటి సంగతి ఏమిటి?"

"ఏది ఎప్పుడు ఎలా జరుగాలని వుంటే అలా జరుగుతుంది. జరుగబోయే దాన్ని ఎవరూ ఆపలేరు, మార్చలేరు. దాని గురించి ముందుగా బాధపడటం మనసుకు సంకటమే తప్ప ప్రయోజనం ఉండదు. కాళ్ళూ చేతులు బాగా ఉన్నంత కాలం నా పని నేనే చేసుకుంటాను. నా గారెలు కొనుక్కుని తినేవాళ్ళ ముఖాల్లో ఆనందం చూడటం నాకు పరమానందం. మీ మూలంగా దానికి దూరం కాలేను. అయినా ఈ రోజు మీరు జాలి చూపిస్తారు. రేపటి నుండి నా గతి ఏమిటి? రేపయినా నా పని నాకు తప్పదు కదా!"

ధనవంతుడు చిన్నగా నిట్టూర్చి లేచి నిలబడి జేబులోంచి పదివేల రూపాయలు తీసి ఇవ్వ బోయాడు. ముసలమ్మ నవ్వుతూ సున్నితంగా తిరస్కరించింది. దాంతో ఆ ధనవంతుడిలో ఏ మూలో ఇంకా మిగిలిన కొంచెం గర్వం కూడా పూర్తిగా తొలగి పోయింది. ఒక్కసారి తనగురించి, తన వ్యాపారం గురించి, తన సంపద గురించి, విలాసవంతమైన తన జీవితం గురించి ఆలోచించాడు. నడవడిలో ఆమెతో పోల్చుకుంటే తన స్థానమేమిటో స్పష్టంగా అర్థమైంది. జీవితంలో ఎన్నడూ తన దరిదాపులకు కూడా రాని ఆలోచన ఇప్పుడు తన మనసునిండా వుంది. ఎందుకో ఇప్పుడు తన శరీరం తెలికయినట్టు అనిపించింది. మనసుకు హాయిగా వుంది. లేచి మారు మాటాడకుండా కిందికి దిగాడు. అతని భార్యా, పనివాళ్ళు మెట్లెక్కి ఎదురు వస్తూ

కనిపించారు.

కొంత కాలం గడిచింది. ఒక రోజు ముసలమ్మ హటాత్తుగా జబ్బుచేసి లేవలేక మంచంలో పడింది. ఎలా వచ్చిందో ఎవరికీ తెలియదు గంట లోపల అంబులెన్సు వచ్చి ఆమెను ధనవంతుడి ఇల్లు చేర్చింది. అక్కడ ఆమెకు విశాలమైన ఇల్లు. వైద్యం చేయడానికి, సేవచేయడానికి ఏంతోమంది డాక్టర్లు, నర్సులు.

ఆమె కాస్త కోలుకున్నాక ధనవంతుడు ఆమె వద్దకు వచ్చి "ఇప్పుడైనా నీకు సేవ చేసుకునే భాగ్యం కలిగిస్తావా?" అన్నాడు. ముసలమ్మ ధనవంతుడిని గుర్తు పట్టింది."ఇప్పుడు నా చేతిలో ఏమీ లేదు. నేను అప్పుడే చెప్పాను కదా! ఏది ఎప్పుడు ఎలా జరుగాలని వుంటే అలా జరుగుతుందని." అన్నది.